ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
గురువారం 27 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:31 గురువారం సాయంత్రం
సహర్: 5:03 శుక్రవారం ఉదయం

శాటిలైట్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలి

- వరంగల్ రైతులు, కార్మికులకు సహకారంలో శిక్షణ ఇవ్వాలి
- త్రిభువన్ సహకార వర్సిటీ ప్రయోజనం వరంగల్‌కూ అందాలి
- పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య


పార్లమెంట్‌లో త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయ బిల్లుపై మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సహకార రంగ విస్తరణకు శాటిలైట్ క్యాంపస్‌లు అవసరమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అభిప్రాయపడ్డారు. బుధవారం పార్లమెంట్‌లో త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయం బిల్లుపై జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. సహకార రంగంలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాటిలైట్ క్యాంపస్‌లను ప్రోత్సహించాలని సూచించారు. ఇందులో భాగంగా తెలంగాణలో శాటిలైట్ క్యాంపస్‌లు, మొబైల్ శిక్షణ యూనిట్లను ఏర్పాటు చేయాలని కోరారు. వరంగల్ రైతులు, సహకార రంగంలోని కార్మికుల సంక్షేమ కోసం దీనిని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. సహకార రంగంలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు నైపుణ్య వృద్ధి కోసం విశ్వవిద్యాలయ స్థాయి సంస్థలను నెలకొల్పడం హర్షణీయం అన్నారు. త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయం బిల్లు సహకార రంగాభివృద్ధికి ఆశాకిరణం లాంటిదనే చెబుతూనే అనిశ్చితిని కూడా కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. వరంగల్ రైతులు, సహకార కార్మికుల సంక్షేమం కోసం దీనిని జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని చెప్పారు. గుజరాత్‌లోని ఆనంద్‌లో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు సహకార రంగంలో శిక్షణ, పరిశోధనకు ఊతం ఇస్తుందని, అయితే వరంగల్ రైతులకు ఇది అందుబాటులో ఉంటుందా అని ఎంపి కావ్య ప్రశ్నించారు. ఇర్మాను విశ్వవిద్యాలయంగా మార్చడం సానుకూలమైనప్పటికీ, గ్రామీణ భారత అవసరాలకు ఇది ఎలా సరిపోతుందని ఎంపీ అడిగారు. తెలంగాణలో శాటిలైట్ క్యాంపస్‌లు, సంచార శిక్షణా యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సహకార ఉద్యోగుల సామర్థ్యం కోసం 5 ఏళ్ల కార్యాచరణ ప్రణాళిక, 50 శాతం గ్రామీణ కార్మికులకు శిక్షణ, పది ప్రాంతీయ కేంద్రాల ఏర్పాటు వంటి లక్ష్యాలను బిల్లులో చేర్చాలని డాక్టర్ కావ్య కోరారు. ఈ బిల్లులో చిన్న రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సమానత్వ దీపస్తంభంగా ఈ బిల్లు ఉపయోగపడాలని పేర్కొన్నారు. సహకార లభ్యత, సమ్మిళిత భావన, పారదర్శకత కోసం ఈ బిల్లును సమర్థవంతంగా రూపొందించాలని సభను కోరారు. గ్రామీణులకూ ఉపకరించే సహకార బిల్లు కోసం వరంగల్, ముఖ్యంగా తెలంగాణ ఎదురుచూస్తోందని అన్నారు.

బడుగులపై వడ్డీ పిడుగు!

నర్సంపేటలో పేట్రేగిపోతున్న వడ్డీ వ్యాపారం



- అత్యవసరాలను ఆసరాగా తీసుకుంటున్న వ్యాపారులు
- అధిక వడ్డీలు కట్టలేక ఆస్తులు కోల్పోతున్న సామాన్యులు
- బ్యాంకుల్లో సామాన్యులకందని రుణాలు
- చక్రవడ్డీలతో హడలెత్తిస్తున్న 'వడ్డీ కాసుల రాణి'
- పోలీసుల ఉదాసీనతతో మితిమీరుతున్న దందా

నర్సంపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అప్పు సామాన్యుల పాలిట పెనుముప్పుగా మారింది. అవసరానికి తెచ్చిన వడ్డీకి చక్రవడ్డీల పేరుతో వడ్డీ వ్యాపారులు జలగల్లా పట్టిపీడించడంతో సామాన్యులు ఆగమాగమవుతున్నారు. వరంగల్ జిల్లాలోని ప్రతీ పల్లె నుంచి పట్టణాల వరకు రోజు వడ్డీ, వారం వడ్డీ, పక్షం, నెల పేరుతో కొందరు వ్యక్తులు అనధికారిక ఫైనాన్స్ దుకాణాలు తెరిచి రెండు చేతులా సంపాదిస్తున్నారు. రూ.100కి రూ.10 మొదలుకొని రూ.30వరకు వడ్డీ చొప్పున వసూలు చేస్తూ చిరుద్యోగులు, మధ్య తరగతి ప్రజలు, వ్యాపారుల పాలిట యమకింకరులుగా మారుతున్నారు. జిల్లాలోనే ప్రధాన పట్టణమైన నర్సంపేటలో వడ్డీ వ్యాపారులు చెలరేగిపోతున్నారు. ఇచ్చేటప్పుడు ఒక లెక్క, తీసుకునేటప్పుడు ఇంకో లెక్క అన్నట్లు ఇష్టారాజ్యంగా లెక్కలు వేస్తూ అవసరానికి అప్పు తీసుకున్న వారికి చుక్కలు చూపిస్తున్నారు. అప్పుల కోసం బ్యాంకు వద్దకు వెళితే లేనిపోని కొర్రీలు పెట్టడంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తే అధిక వడ్డీలు సామాన్యుల కొంపలను కూల్చుతున్నాయి.

సామాన్యులకందని రుణాలు

అవసరాలకు బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు సవాలక్ష నిబంధనలు విధిస్తున్నారు. ఐటీలు, సిబిల్ స్కోర్, జమానత వంటి కొర్రీలు పెడుతుండడంతో సామాన్యులకు బ్యాంకు రుణాలు అందని ద్రాక్షలా మారాయి. కొన్ని బ్యాంకుల్లో మధ్యవర్తుల ద్వారా కమీషన్లు ముట్టజెప్పి పనులు కానిచ్చే వారికే ప్రాధాన్యత ఇవ్వడంతో పేదలు, మధ్య తరగతి ప్రజలు బ్యాంకు రుణాలపై ఆశలు వదులుకుంటున్నారు. గత్యంతరం లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది

పుట్టగొడుగుల్లా ఫైనాన్స్ వ్యాపారులు

వడ్డీ వ్యాపారులు అడుగడుగునా పుట్టగొడుగుల్లా వెలుస్తున్నారు. ఒక లక్ష చేతిలో ఉంటే అధిక వడ్డీలతో తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో వ్యాపారం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే వడ్డీ వ్యాపారం చేస్తూ చెలరేగిపోతున్నారు.

అక్రమంగా ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తే చర్యలు

నర్సంపేట డివిజన్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఫైనాన్స్ వ్యాపారం నిర్వహించే వారిపై చర్యలు తప్పవు. అధిక వడ్డీలతో ఎవరైనా వ్యాపారులు ఇబ్బందులు పెట్టినట్లు బాధితులు తమ దృష్టికి తీసుకొస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– కిరణ్‌కుమార్, నర్సంపేట ఏసీపీ

ఆసరాగా తీసుకుంటున్న వ్యాపారులు

పేదలు, సామాన్యుల అత్యవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు.. అధిక వడ్డీలకు డబ్బులిస్తూ వ్యాపారాన్ని జోరుగా నడిపించుకుంటూ పేదల కష్టాన్ని దోచుకుంటున్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో సామాన్య కుటుంబం రోజు వారీగా గడవడమే కష్టంగా మారింది. ఇలాంటి తరుణంలో కుటుంబ ఆర్థిక పరిస్థితులు, పిల్లల చదువులు, ఆడపిల్లల పెళ్లిళ్లు.. ఇలా తమ అత్యవసరాల కోసం వడ్డీ ఆశ్రయించాల్సి వస్తోంది. వీరి అవసరాన్ని ఆసరా చేసుకొని వ్యాపారులు రూ.5నుంచి రూ.10 వరకు వడ్డీకి డబ్బులు ఇస్తున్నారు. దీంతో తీసుకున్న అప్పుకు అసలుతో సహా వడ్డీకి వడ్డీ, చక్రవడ్డీ చెల్లించలేక ఆస్తులు కోల్పోవాల్సి వస్తోంది. కొంతమంది వడ్డీవ్యాపారులు పెట్టే ఒత్తిళ్లు తట్టుకోలేక ఉన్న ఊరిని వదిలివెళ్లిపోతున్నారు.

వడ్డీ కాసుల వసూళ్ల రాణి

నర్సంపేట పట్టణంలో పదేళ్లుగా ఎలాంటి అనుమతులు లేకుండానే ఓ మహిళ వడ్డీ వ్యాపారం కొనసాగిస్తోంది. తాను చెప్పేదే వేదం అనే విధంగా ఇష్టారాజ్యంగా వడ్డీలకు వడ్డీలు విధిస్తూ వడ్డీ కాసుల రాణిగా పేరుగాంచింది. ఆమె వద్ద రూ.1 లక్షకు రూ.10లకు పైనే వడ్డీ వేస్తుంది. వడ్డీ సకాలంలో చెల్లించకపోతే వడ్డీ కాస్తా ఐదింతలై కూర్చుంటుంది. ముందుగా సంతకాలు చేసిన ఖాళీ ప్రామిసరి నోట్లు, చెక్కులను తన వద్ద పెట్టుకుంటుంది. వడ్డీని చెప్పిన సమయానికి ఇవ్వకున్నా, ఎదురు ప్రశ్నించినా.. లక్షకు పది లక్షలు ఇచ్చినట్లుగా రాసుకుంటుంది. ఇంకో మెట్టు ఎక్కి బాకీపడ్డ వాళ్ల ఇళ్లకు తాళాలు వేసి గెంటేయడం, నానా దుర్భాషలాడుతూ హంగామా చేస్తుంటుంది. ఈమె విధించే వడ్డీ చెల్లించేక నర్సంపేట, దుగ్గొండి, మహేశ్వరం, గూడూరు తదితర ప్రాంతాలకు చెందిన బాధితులు ఆస్తులను కోల్పోవాల్సి వచ్చినట్లు సమాచారం. కాసుల రాణి బెదిరింపులకు భయపడి ఊరు విడిచివెళ్లినవారున్నారు. కొందరు బాధితులు మహిళపై

(మిగతా 8వ పేజీలో)

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- నర్సంపేట మునిసిపల్ కార్యాలయం తనిఖీ

నర్సంపేట టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద కోరారు. బుధవారం నర్సంపేట మునిసిపాలిటీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఎల్‌ఆర్‌ఎస్ కింద క్రమబద్ధీకరణకు చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2020 ఆగస్టు 26కు ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఈ నెల 31తో ముగుస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రాయితీ పొందవచ్చన్నారు. కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలో 5,732 మంది దరఖాస్తుచేసుకోగా 2,271 క్రమబద్ధీకరణకు మంజూరు చేయగా 293 మంది ఫీజు చెల్లించారని, 186 మందికి క్రమబద్ధీకరణ పత్రాలు అందించామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని దరఖాస్తుదారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోనే ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సంధ్య, టీపీవో వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు కట్టుకోవాలి..

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరూ ఇల్లు కట్టుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యశారద సూచించారు.


రామతీర్థంలో ఇందిరమ్మ ఇండ్ల ముగ్గును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

నల్లబెల్లి మండలంలోని రామతీర్థం, నారక్కపేట గ్రామాల్లో కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. రామతీర్థం గ్రామంలో మంజూరైన 31 ఇందిరమ్మ ఇండ్లు మొత్తం కట్టుకోవాలని లబ్ధిదారులకు తెలియజేశారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు వస్తాయని తెలిపారు. లబ్ధిదారులు త్వరగా ఇండ్లు కట్టుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారుల ఇండ్ల ముగ్గులను, పునాదులను పరిశీలన చేశారు. అంతేకాక, నారక్కపేట మిషన్ భగీరథ పంపుహౌస్‌ను పరిశీలన చేశారు. పంపుహౌస్ వద్ద ఎలాంటి లీకేజీలు లేకుండా చూడాలని ఏఈ, డీఈలకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎస్సై గోవర్ధన్, ఎంపీడీవో నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.

ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ

- శివారులో స్థలాన్ని పరిశీలించిన బీఆర్‌ఎస్ నేతలు
- భారీస్థాయిలో సభ నిర్వహణకు ఏర్పాట్లు

ఎల్కతుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి మండల పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ నిర్వహణకు దాదాపుగా స్థలం ఖరారైంది. బుధవారం హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌లతో కలిసి ఎల్కతుర్తి మండల కేంద్రానికి సమీపంలో స్థల పరిశీలన చేశారు. ఏప్రిల్ 27వ తేదీన వరంగల్ కేంద్రంగా బీఆర్‌ఎస్ పార్టీ 25 యేళ్ల రజతోత్సవ బహిరంగ సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఇందుకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని మాజీ సీఎం, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు నాయకులు స్థల పరిశీలనలో పడ్డారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని వేలాదిగా తరలిరానున్న ప్రజలకు అనువుగా ఉండే ప్రదేశాన్ని ఎంపిక చేయాలని కేసీఆర్ ఆదేశాల మేరకు సభకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక కోసం కసరత్తులు ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని భట్టుపల్లి, దేవన్నపేట, ఉనికిచెర్ల గ్రామాల పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులు స్థల పరిశీలన చేశారు. కాగా, ఎల్కతుర్తి మండల కేంద్రం హనుమకొండ, కరీంనగర్, సిద్ధిపేట మూడు జిల్లాల సరిహద్దులో ఉండటంతో సభ నిర్వహణకు అనువైన ప్రదేశంగా నాయకులు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఎల్కతుర్తి - చింతలపల్లి గ్రామాల శివారులోని స్థలాన్ని దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డిలు పరిశీలించారు. సంబంధిత రైతులతో మాట్లాడి ఒప్పందాలు సైతం చేయించుకున్నారు. జన సమీకరణలో భాగంగా మరిన్ని ప్రదేశాలను సైతం చూస్తున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చింతలపల్లి గ్రామ శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు వినయభాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, సతీష్‌కుమార్

లంచగొండి వ్యవస్థను రూపుమాపాలి

లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ


లంచగొండి అధికారులను పట్టించిన వారిని సన్మానిస్తున్న జయప్రకాష్ నారాయణ

హనుమకొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): లంచగొండి వ్యవస్థను క్రమంగా రూపుమాపాలని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్‌నారాయణ ప్రజలకు సూచించారు. బుధవారం హనుమకొండలో జ్వాలా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ ఆధ్వర్యంలో ఇటీవలి కాలంలో లంచగొండు అధికారులను ఏసీబీకి పట్టించిన వారిని జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా సన్మానించి, వారికి నగదు పారితోషిక చెక్కులను అందించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. దేశంలో కొంతమంది జడ్జిలు కోట్లాది రూపాయలతో పట్టుపడుతున్నారని, అలాంటి వారిపై తక్షణమే పార్లమెంటరీ వ్యవస్థ చర్యలు తీసుకోవాలని అన్నారు. నోట్ల కట్టలతో పట్టుబడిన జడ్జిని సస్పెండ్ చేయాలన్నారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం కలుగాలంటే న్యాయమూర్తులను నియమించే విధానం మారాలని అభిప్రాయపడ్డారు. న్యాయ వ్యవస్థలో కొందరు దొంగలున్నారని అన్నారు. రాజకీయాల్లో డబ్బు ఖర్చు చేసి ఓట్లు అడుకుంటున్నారని, తర్వాత ఎమ్మెల్యే, మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. తప్పు చేసిన వారికి కఠినంగా శిక్ష లు అమలు చేయాలని అన్నారు. ప్రస్తుతం దేశంలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులకు ప్రమోషన్లు వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. సమాజంలో మార్పు కచ్చితంగా వస్తుందని, ఈ దేశంలోని యువత అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవినీతికి వ్యతిరేకంగా పోరాడేతత్వంలేక, సమయం కేటాయించలేక లంచాలు ఇస్తున్నారని మండిపడ్డారు. దేశంలో లంచం ఇస్తున్నవారు, తీసుకుంటున్న వారు ఈ దేశ సంపదను దోచుకుంటున్నారని తీవ్రంగా ఆరోపించారు. న్యాయ వ్యవస్థ కూడా అవినీతి ఆరోపణలు రావడం సిగ్గుచేటన్నారు.

వరంగల్‌లో పౌరుషం, నిబద్ధతకలిగిన చైతన్య వంతులు ఉన్నారని, నిర్మాణాత్మకంగా లంచగొండు అధికారులకు వ్యతిరేకంగా మార్పు కోసం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్వాలా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వైపీ గణేష్

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

జిల్లా రెవెన్యూ అధికారి వైపీ గణేష్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని, గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో గంజాయి కేసులతో పాటు, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి చర్చించారు. అనంతరం రెవెన్యూ అధికారి వై.వి గణేష్, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారిపై, వినియోగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సినిమా హాళ్లలో కూడా మత్తు పదార్థాల నియంత్రణకు స్లైడ్స్ వేసే విధంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతో పాటు విస్తృతప్రచారం చేపట్టేందుకు క్రీడా, ఇతర రంగాలలోని సెలబ్రిటీలతో గంజాయి, ఇతర మత్తుదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అధికారులు, అర్డీఓ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ధరలు.. అన్నదాతల దిగాలు

- ఆందోళన చెందుతున్న మిర్చి రైతులు
- వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆరోపణలు

6



ఈ-పాస్‌లో నీట్ పీజీ ప్రవేశాలు

» ఎట్టకేలకు స్పందించిన కాళోజీ వర్సిటీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హనుమకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అధికారుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. యూనివర్సిటీ నీట్ పీజీ ప్రవేశాల డాటాను ఈ-పాస్‌కు అందజేశారు. వెబ్‌సైట్‌లో డాటా కనిపిస్తోంది. దీనితో విద్యార్థులు స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తులు చేసుకోవడం మొదలు పెట్టారు. దరఖాస్తుల దాఖలుకు ఈనెల 30 చివరి తేదీ. నీట్ పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయి రెండు నెలలు పూర్తవుతున్నా ఇందుకు సంబంధించిన డాటాను యూనిర్సిటీ అధికారులు ఈ-పాస్‌కు అందజేయలేదు. ఇదే విషయమై ఈ-పాస్‌లో నమోదవ్వని నీట్ ప్రవేశాల డాటా శీర్షికతో ఈనెల 21న ఆంధ్రజ్యోతిలో వార్తకథనం ప్రచురితమైంది. ఈ విషయం యూనివర్సిటీ కొత్త వీసీ దృష్టికి రావడంతో ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది వెంటనే డాటాను ఈ-పాస్‌కు అందచేశారు. అయితే ఇదే విషయాన్ని యూనివర్సిటీ అధికారికంగా తెలియచేయాల్సి ఉండగా, ఈ పని చేయకపోవడంతో ఇంకా చాలామంది విద్యార్థులకు ఇందుకు సంబంధించిన సమాచారం చేరలేదు.

రుణాల రికవరీలో వరంగల్ జిల్లా ఫస్ట్



అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి సీతక్క

వరంగల్ కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాల రికవరీలో వరంగల్ జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణాలు ఇవ్వడం, రికవరీ చేయడంలో గ్రామీణ స్థాయిలో సెర్ప్, పట్టణస్థాయిలో మెప్మా విభాగాలలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా గచ్చిబౌళి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) చేతులమీదుగా మెప్మా విభాగం నుంచి ఇన్‌చార్జి పీడీ, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, సెర్ప్ విభాగం నుంచి డీఆర్‌డీవో కౌసల్యాదేవి అవార్డును అందుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది, జిల్లాస్థాయి సిబ్బంది చేసిన కృషితోనే ఇది సాధ్యమైందని, ఉత్తమ అవార్డు దక్కడం సంతోషంగా ఉందని అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి అన్నారు.

వనదేవతల హుండీ ఆదాయం రూ.1.8 కోట్లు

తాడ్వాయి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలకు చెందిన హుండీలను బుధవారం లెక్కించారు. మొత్తం 54హుండీల ద్వారా రూ.1,08,03,173ఆదాయం సమకూరిందని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఆదాయంలో ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 26వతేదీ వరకు ఉన్న ఆదాయాన్ని లెక్కించగా.. ఇందులో ఫిబ్రవరి 12వతేదీ నుంచి నాలుగు రోజుల నిర్వహించిన మినీజాతరకు వచ్చిన భక్తులు వేసిన కానుకలు అధికమొత్తంలో ఉన్నాయి. పూజారుల సమక్షంలో ఈ లెక్కింపు జరగ్గా.. సమ్మక్కకు చెందిన 24 హుండీల ద్వారా రూ. 58,66,409, సారలమ్మకు చెందిన 24హుండీల్లో రూ. 45,61,892, పగిడిద్ద రాజుకు చెందిన మూడు హుండీల్లో 1,61,003, గోవిందరాజుకు చెందిన మూడు హుండీల్లో రూ.2,13,869 వచ్చాయని మేడారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తెలిపారు. మొత్తం ఖాళీ అయిన 54 హుండీల్లో 16 హుండీలను సీల్ చేసి గద్దెల వద్ద మళ్లీ ఏర్పాటు చేశామన్నారు.

బీజీడీకేఎస్ కమిటీ ఎన్నిక

హనుమకొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ గ్రామీణ డాక్ కర్మచారి సంఘం (బీజీడీకేఎస్) యూనియన్ నూతన కమిటీ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగినట్లు డివిజన్ కమిటీ అధ్యక్షుడు బి.అశోక్ గౌడ్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా ధరావత్ రవి, ఎన్.నర్సయ్య, కార్యదర్శిగా కె. మనోజ్, కోశాధికారిగా ఎం.డి.షారూక్‌లను హనుమకొండలోని హెడ్ పోస్టాఫీస్ కార్యాలయంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. కాగా, నూతనంగా ఎన్నికైన కమిటీ నియామకపత్రాన్ని హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ వి.హన్మంతును కలిసి నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు.

నియామక పత్రాన్ని సూపరింటెండెంట్‌కు అందిస్తున్న కమిటీ సభ్యులు



తగ్గుతున్న ధరలు.. అన్నదాతల దిగాలు

» ఆందోళన చెందుతున్న మిర్చి రైతులు
» వ్యాపారులు కుమ్మక్కయ్యారని వెల్లువెత్తుతున్న ఆరోపణలు



ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

వరంగల్ వ్యవసాయం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడికి, వచ్చిన దిగుబడికి, మార్కెట్లో పలుకుతున్న ధరలకు ఏమాత్రం పొంతనలేకపోవడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ఇదే విధంగా ధరలు కొనసాగితే అప్పులపాలవడం ఖాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో వ్యాపారులందరు కుమ్మక్కై మిర్చి ధరలు తగ్గిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

వరుసగా తగ్గుదల..

2023లో క్వింటా రూ.99వేల వరకు పెట్టి వ్యాపారులు మిర్చి కొనుగోలు చేశారు. దీంతో 2024లో కూడా అదే స్థాయిలో ధరలు పెరుగుతాయని రైతులు అధికంగా మిర్చి సాగు చేశారు. కాని అందుకు విరుద్ధంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. గరిష్టంగా క్వింటా రూ.40 వేలకు, కనిష్ఠంగా రూ.20 వేలకు కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు. ఇప్పటికే సుమారు 10 లక్షల క్వింటాళ్ల మిర్చి కోల్డ్‌స్టోరేజీల్లో ఉంది. ఇక ఈ సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.18 వేల వరకు పలుకుగా ప్రస్తుతం అది రూ.13 వేల నుంచి రూ.9 వేలకు పడిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోల్డ్ స్టోరేజీల్లో పేరుకుపోతున్న మిర్చి

రెండు సంవత్సరాల నుంచి మిర్చి ధరలు పెరుగుతాయని రైతులు, వ్యాపారులు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేస్తున్నారు. గత నిల్వలే 10 వేల క్వింటాలుండగా ఈ సీజన్ ప్రారంభం నుంచి వ్యాపారులు కొనుగోలు చేసినవి, రైతులు నిల్వ చేసినవి సుమారు 5 వేల క్వింటాళ్ల వరకు ఉన్నాయి. మిరి కొద్ది రోజులు ఇలాగే కొనసాగితే కోల్డ్ స్టోరేజీలు నిండిపోయే అవకాశాలున్నాయి. మరోవైపు ధరలు మరింత పతనమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ ఎగుమతులు పెరిగితే తప్ప మిర్చి ధరలు పెరిగే అవకాశాలు కనిపించడం లేదని వ్యాపారులు అంటున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఆదుకోవాలి

మిర్చి ధరలు రోజు రోజుకూ పతనమవుతున్నందున తమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. పెట్టుబడి, చేసిన శ్రమ పోయి పైపెచ్చు అప్పుల పాలైతే ముందు ముందు వ్యవసాయం చేసే వారే ఉండరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు రైతుకు గిట్టుబాటు అయ్యేలా ప్రభుత్వాలే నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. పెట్టిన పెట్టుబడిని, చేసిన శ్రమను లెక్కలోకి తీసుకుని లాభం వచ్చేలా ధర నిర్ణయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు వచ్చే ప్రధానమైన మిర్చి రకాలు, ధరలు

మిర్చి రకం	2022 ఫిబ్రవరి	2023 ఫిబ్రవరి	2024 ఫిబ్రవరి	2025 ఫిబ్రవరి	2025 మార్చి (26-3-2025) (గరిష్ఠ)	(కనిష్ఠ)
దేశీ మిర్చి	29,000	73,000	42,000	25,000	28,000	18,000
వండర్‌హాట్	23,000	37,000	23,600	14,500	15,500	12,000
తేజ	18,800	20,000	22,000	14,000	12,800	9,500
యూఎస్-341	25,000	21,900	20,000	13,500	12,200	9,000
డిడి	21,500	19,900	----	----	----	----
దీపిక	34,000	23,000	16,000	13,000	10,000	

భూ భారతితో రెవెన్యూ శాఖ బలోపేతం

» గ్రామస్థాయిలో మెరుగైన సేవలు
» 10,954 గ్రామ పాలన అధికారుల నియామకం
» తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

ములుగు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో రెవెన్యూ శాఖ బలోపేతం అవుతుందని, విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ములుగులో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. లచ్చిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా 33 సెక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను సాధించుకున్నామన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ఈ భూభారతి అమలు కాబోతోందని, 10,954 గ్రామ పాలన అధికారుల నియామకం జరుగుతుందని తెలిపారు. లబ్దిదారులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించేందుకోసం రెవెన్యూ ఉద్యోగులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. భూ భారతి చట్టంతో తహసీల్దార్లు, ఆర్డీవోలు, అదనపు కలెకర్‌లకు అధికారాలు లభిస్తాయని చెప్పారు. సీసీఎల్‌ఏ నుంచి గ్రామపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరిగిందని తెలిపారు. ఈవిష యంలో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉందని, పాలకుల సహకారంతో ప్రజా సంక్షేమానికి పునరంకితం కావాలని కోరారు. గత ప్రభుత్వంలో 317జీవో ఉద్యోగుల జీవితాలను ఛిన్నాభిన్నం చేసిందని, ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలు చెట్టుకొకరు పుట్టకొకరిగా వేర్వేరుచోట్ల పోస్టింగ్ ఇచ్చారన్నారు. ప్రస్తుతం జీవో నిబంధనలకు రాష్ట్ర ప్రభుత్వం సడలింపునిచ్చిందని, స్పౌజ్, మెడికల్, ఇతర బదిలీలకు అవకాశం కల్పించిందని తెలిపారు. వీఆర్‌వోలు, వీఆర్‌ఏలను మాతృశాఖలోకి తీసుకోవడం, తహసీల్దార్‌లు, ఆర్డీవోలు, జేసీలు గతంలో కోల్పోయిన అధికారాలను తిరిగి సాధించుకోవడం, భూభారతి-2025చట్టాన్ని పునరుద్ధరించుకోవడం రెవెన్యూ శాఖ సాధించిన విజయాలని లచ్చిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్, టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బానాల రాంరెడ్డి, వి.భిక్షం, ఆర్డీవోలు గోపిరామ్, వెంకన్న, రాథోడ్ రమేష్, ఉద్యోగ సంఘం నాయకులు ఫూల్‌సింగ్, పి.రాధ, సుజాత చౌహాన్, కృష్ణచైతన్య, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు మరో మూడు నెలలు పొడిగింపు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 2022- 2024 సంవత్సరానికి జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు మరో 3 నెలలు ప్రభుత్వం పొడిగించినట్లు డీపీఆర్‌ఓ భానుప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యువల్‌కు సంబంధించిన స్టిక్కర్స్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులకు గురువారం నుంచి కలెక్టరేట్‌లో స్టిక్కర్లు వేయనున్నట్లు తెలిపారు. బస్‌పాస్ రెన్యువల్ కోసం జర్నలిస్టులు ఆర్టీసీ కౌంటర్‌కు వెళ్లే ముందు జర్నలిస్టుల దగ్గర ఉన్న ఒరిజినల్ బస్ పాస్, పాస్ ఫొటో, అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకు వెళ్లాలని డీపీఆర్‌వో భానుప్రసాద్ ఆ ప్రకటనలో కోరారు.

జేఎల్ అభ్యర్థులకు రీలివింగ్‌పై రగడ

» ఆర్డర్లు ఇవ్వని సోషల్ వెల్ఫేర్ అధికారులు
» ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

కేయూ క్యాంపస్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో టీచర్లుగా, లెక్చరర్లుగా ఉద్యోగం చేస్తున్నవారు.. తాజాగా మరో ఉద్యోగం సంపాదించగా వారికి రిలీవ్ అర్డర్లు జారీ చేయకుండా గురుకుల సొసైటీ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. దీంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

కొన్ని నెలల కిందట రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల్లో టీచర్లు, లెక్చరర్లు, లైబ్రేరియన్ల ఉద్యోగాలకు ఎంతోమంది ఎంపికయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందుకుని కేటాయించిన గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చలర్ పోస్టులను భర్తీ చేశారు. గురుకులాల్లో పనిచేస్తున్నవారు జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా ఎంపికయ్యారు. వీరికి మార్చి 3వవారంలో హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నియామకాల ఉత్తర్వులు అందచేశారు. కాగా, గురుకులాల్లో పనిచేస్తున్న వారిలో కొందరు లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికకాగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లేందుకు వీరికి అధికారులు రిలీవ్ అర్డర్లు ఇవ్వాలి. అలా ఇస్తేనే సర్వీస్ బ్రేక్ లేకుండా ఉంటుంది. అయితే గురుకుల సొసైటీ అధికారులు తమకు రిలీవ్ అర్డర్లు ఇవ్వడం లేదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే దరఖాస్తు చేసే సమయంలో గురుకుల అధికారుల ఎన్‌ఓసీ సర్టిఫికెట్లను అభ్యర్థులు సమర్పించారు. అయినా ఎంపికైన వారికి రిలీవ్ అర్డర్లను మాత్రం ఇవ్వడం లేదు.

అయితే తమ సంస్థలోని అధ్యాపకులందరూ వెళ్లిపోతున్నారనే కారణంతో గురుకుల సొసైటీ అధికారులు రిలీవ్ అర్డర్లు ఇవ్వడం లేదని, గట్టిగా అడిగితే రాజీనామా చేసి వెళ్లండి.. అంటూ హుకుం జారీ చేస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. దీంతో అభ్యర్థులు సంశయంలో పడ్డారు. గతంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు సొసైటీ అధికారులు రిలీవ్ అర్డర్లు జారీ చేశారు. కానీ ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. గిరిజన, మైనారిటీ సొసైటీ ఉన్నతాధికారులు మాత్రం అక్కడి అభ్యర్థులకు రిలీవ్ అర్డర్లను జారీ చేస్తున్నారని, కేవలం సాంఘిక సంక్షేమ గురుకుల అధికారులే రిలీవ్ అర్డర్లు ఇవ్వడం లేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

భారీ మొత్తంలో గుట్కాలు పట్టివేత

వరంగల్ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జనగామ పీఎస్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న ప్రభుత్వ నిషేధిత గుట్కాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. సీఐ బాబులాల్ టీం రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి మలరం ఇంట్లో బుధవారం రాత్రి సోదాలు చేయగా వివిధ కంపెనీలకు చెందిన రూ.4,89,650 విలువ చేసే గుట్కాలు పట్టుబడ్డాయని, వాటిని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు. కాగా, ఈ ఘటనలో మరో వ్యాపారి గమ్నరం అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

నల్లబెల్లిలో ఏడుగురు ఇన్విజిలేటర్ల తొలగింపు

నర్సంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నల్లబెల్లి మండల కేంద్రం లో జరుగుతున్న టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు స్క్వాడ్ అధికారులు గుర్తించారు. ప్రభుత్వ హైస్కూల్, కారుణ్య జ్యోతి హైస్కూల్‌లకు పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ కేటాయిం చింది. నల్లబెల్లి ప్రభుత్వ హైస్కూల్లో ఇంగ్లిష్ పరీక్ష జరుగుతున్న సమయంలో ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిబ్బంది వచ్చి విద్యార్థు లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో నకల్ చిట్టీల కట్ట బయట పడింది. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్స్ డీఈవో జ్ఞానేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో అనూరాధ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు ఇన్విజిలేటర్లను తొలగిస్తూ ఉత్త ర్వులు ఇచ్చారు. అనంతరం గణితం పరీక్ష రోజు మరో ఏడుగురు కొత్త ఇన్విజిలేటర్లను నియమించారు. కాగా, మాస్ కాపీయింగ్ జరగడంపై మండలంలో తీవ్ర చర్చ నడుస్తోంది.



విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

భద్రకాళి చెరువులో విగ్రహం లభ్యం

పూడికతీతలో బయల్పడిన నాగేంద్రస్వామి ప్రతిమ

వరంగల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో బుధవారం నాగేంద్రస్వామి విగ్రహం బయల్పడింది. తటాక ఆంజనేయ స్వామి గుడి ప్రాంతంలో పనులు చేపడుతుండగా మూడర్ల నాగేంద్రస్వామి విగ్రహం బయటపడింది. భక్తులు దాన్ని తీసుకెళ్లి స్థానిక గుట్ట వద్ద ఏర్పాటు చేసి పసుపు కుంకమలు చల్లి, కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాగేంద్రస్వామి విగ్రహాన్ని దర్శించుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈగ మల్లేశం

వర్ధన్నపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చైతన్య కళా సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఈగ మల్లేశం విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవ చర్యల కారణంగా పర్యావరణానికి ముప్పు ఏర్పడబోతోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి పరిరక్షణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలను నాటి వాటిని పరిరక్షించి ఆదర్శంగా నిలవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని భారీగా నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌సాగర్, మునిసిపల్ కమిషనర్ ఇమ్మడి సునీల్‌కుమార్, ఎస్‌ఐ భూక్య చందర్, మాజీ డిప్యూటీ మేయర్ కక్క సారయ్య, ఎస్‌బీఐ మేనేజర్ సునీల్‌కుమార్, ఐనవోలు దేవస్థానం మాజీ చైర్మన్ సిలువేరు కుమారస్వామియాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి, చైతన్య కళా సంస్థ సభ్యులు వల్లాందాస్ లక్ష్మన్, సంపత్‌రావు, సంపత్ యాదవ్, ప్రభాకర్, ప్రవీణ్, విక్రమ్, కుమారస్వామి, రాజు, కుమార్, శివ, కనకయ్య, రమేష్, చిట్టి, చందు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7010	5300
మక్కలు	2051	1521
కందులు	6921	3022
పెసళ్లు	7251	3022
పల్లికాయ (సూక)	6050	5500
పల్లికాయ (పచ్చిది)	4300	2400
పసుపు (గోల)	....	....
తేజ మిర్చి	12800	9500
వండర్ హాట్	15500	12000
యూఎస్ 341	12200	9000
దీపిక	13000	10000
దేశీ	28000	18000
సింగిల్ పట్టి	29000	20000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

15 నుంచి ఎస్డీఎల్‌సీఈ సీఎల్ఐఎస్సీ పరీక్షలు

కేయూ క్యాంపస్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేయూ దూరవిద్య కేంద్రం సర్టిఫికెట్స్ కోర్స్ ఇన్ లైబ్రరీ సైన్స్ (సీఎల్ఐఎస్సీ) 2023-24 బ్యాచ్ అభ్యర్థులకు ఏప్రిల్ 15 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ బి.సురేశ్‌లాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ షెడ్యూల్ ప్రకటించారు. ఏప్రిల్ 15, 17, 19, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో కానీ దూర విద్య కేంద్రంలో కాని సంప్రదించాలని కోరారు.

శిథిలావస్థలో ఎంజీఎం వాటర్ ట్యాంక్

కూలితే లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌కు ప్రమాదం

వరంగల్ మెడికల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది మంది పేద రోగులతో కిటకిటలాడే ఎంజీఎం ఆస్పత్రిలో మంచినీటి వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఆ ట్యాంక్‌కు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ట్యాంక్‌కిందే ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ ధ్వంసం అయ్యే ప్రమాదం పొంచి ఉంది. గతంలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు తమను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో 15 ఏళ్ల కిందట ట్యాంక్ పైకి ఎక్కి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆ సమయంలో మిగతా వారు ఎవరు కూడా ఇలాంటి ఆందోళనలు నిర్వహించకుండా ట్యాంక్‌పైకి ఎక్కే మెట్లుకూల్చివేశారు. ఆ ట్యాంక్‌ను శుభ్రం చేయడానికి వీలు లేని పరిస్థితులు ఉన్నాయి. పైగా ట్యాంకు కింది భాగంలో ఉన్న పిల్లర్లకు బీటలు పడ్డాయి. కొన్నింటికి సిమెంట్ ఊడి తుప్పు పట్టిన ఇనుపరాడ్లు తేలాయి. కొన్నేళ్ల కిందట నిర్మించిన ఈ ట్యాంక్ బాగోగులు చూసుకునే అధికారులే కరువయ్యారు. ట్యాంక్ కింది భాగంలో ఉన్న ప్రాంతమంతా బీటలు వారి ఉంది. ట్యాంక్ కూలితే కిందనే ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌కు పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన మంచినీటి ట్యాంకును కానీ ప్రస్తుత ట్యాంక్ మరమ్మతు చేయించాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



శిథిలమైన వాటర్ ట్యాంక్ పిల్లర్లు

వెంకటేశ్వర్లుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేయూ తెలుగు విభాగం పరిశోధకుడు పిగిడిపల్లి వెంకటేశ్వర్లు డాక్టరేట్ సాధించారు. వెంకటేశ్వర్లు 'డాక్టర్ సీతారాం సాహిత్యం- ఒక అధ్యయనం' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. వెంకటేశ్వర్లు పలు సదస్సుల్లో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు.

పండిత, పామర జనరంజకం.. నాటకం

నేడు ప్రపంచ నాటక (రంగస్థల) దినోత్సవం

- కాకతీయుల కాలం నుంచే ఓరుగల్లులో రంగస్థల ప్రస్థానం
- ఊపిరిలూదిన నాటక సమాజాలెన్నో..
- ఎందరో నటులు, రచయితలు, ప్రయోక్తలకు నిలయంగా కళల కాణాచి

హనుమకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అందమైన, ఆకర్షణీయమైన ఆహార్యం, హృద్యమైన అభినయాదుల ద్వారా పండిత పామర జనరంజకమైంది నాటకం. కాకతీయులకు పూర్వం నుండే ఓరుగల్లు రంగస్థల ప్రదర్శనలకు వేదికగా నిలిచింది. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో ఓరుగల్లు నాటక ప్రద్శనలను ప్రస్తావించాడు. విద్యానాథుడు తన ప్రతాపరుద్ర యశోభూషణంలో అంతర్నాటకాన్ని రచించాడు. ప్రతాపరుద్రుడే స్వయంగా యయాతి చరిత్ర అనే సంస్కృత నాటకాన్ని రాశాడు. వరంగల్‌లోని ప్రాచీన దేవాలయాల్లోని రంగ మంటపాలు, విశాలమైన వేదికలు ఆనాటి రంగస్థల ప్రదర్శనకు ఉపయోగించినవేనని తెలుస్తున్నది. తరుష్కుల పాలనలో యక్షగానాలు భాగవతాలు, వీధి నాటకాలు, లేదా బయట నాటకాలు అనే పేరుతో వరంగల్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శించబడ్డాయి. నిజాం కాలంలో సైతం వరంగల్ సుభా (ప్రస్తుతం సుబేదారి)లో రంగ స్థల నాటక ప్రదర్శనలు జోరుగా జరిగాయి. నేడు ప్రపంచ నాటక (రంగస్థల) దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో రంగస్థల ప్రస్థానంపై ప్రత్యేక కథనం.



ఇటీవల కాళోజీ కళాక్షేత్రంలో నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)

రంగస్థల వేదిక నందయ్య దొడ్డి..

19వ శతాబ్దంలో వృత్తి నాటక సమాజాలు వచ్చాయి. కళాకారులు ఊరూరా తిరిగి నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. ధార్వాడ కంపెనీ, గబ్బి వీరన్న కంపెనీ, సురభి నాటక సమాజాలు ప్రదర్శించిన అనేక నాటకాలకు నాడు వరంగల్ కేంద్రంగా నిలిచింది. వరంగల్ జేపీఎన్ రోడ్డులోని నందయ్యగారి దొడ్డిలో ప్రత్యేకంగా నిర్మించిన వేదికపై అనేక నాటక ప్రదర్శనలు జరిగేవి. వరంగల్ హిందీ నాటకాలకు కూడా వేదికైంది. అప్పటి ప్రముఖ పారిశ్రామిక వేత్త డిడి ఇటాలియా ఆహ్వానం మేరకు ఆరోజుల్లోనే ప్రముఖ రంగ స్థల సినీ నటులు, దర్శకులు పృధ్వీరాజ్, షోహరాబ్ మోడీ తమ బృందంతో వచ్చి నాటక ప్రదర్శనలు ఇచ్చారు. హనుమకొండ వడ్డెపెల్లిలో పింగిళి వెంకట్రాం రెడ్డి ప్రోత్సాహంతో గద్దె సాంబయ్య, శెట్టి వైకుంఠం, ముదిగొండ రాం ప్రసాద్ నట బృందాలు వరుసగా పౌరాణిక, పద్యనాటక ప్రదర్శనలెన్నో ఇచ్చారు. హనుమకొండ జాతికి ఊపిరి స్వాతంత్రం అనే రూకం 200 మంది కళాకారులతో 40 రోజుల పాటు ప్రదర్శించారు. వేలాది మంది ప్రజలు ఈ రూపకాన్ని తిలకించారు. నాటక ప్రదర్శనల్లో ఇదొక అరుదైన రికార్డు.

భారతీయ నాటక కళా సమితి

ఓరుగల్లు నాటక రంగానికి పట్టుగొమ్మగా నిల్చి నేటికీ సేవలందిస్తున్న భారతీయ నాటక కళాసమితి 1974లో వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ఏర్పాటయింది. ఈగ శ్రీహరి, వడ్లకొండ వెంకటయ్య, వేముల అంజనేయులు, వనం లక్ష్మీకాంతారావు దీని వ్యవస్థాపక సభ్యుల్లో ముఖ్యులు. నాటక రంగాభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటైన ఈ సంస్థ అల్లూరు సీతారామరాజు నాటక ప్రదర్శనతో విరాళాలు సేకరించేందుకు పూనుకుంది. ఈ నాటక ప్రదర్శన కార్యక్రమంలో మునుగోటి నర్సయ్య గుప్త రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఈ విరాళం, నాటక ప్రదర్శన ద్వారా వచ్చిన డబ్బు, ప్రభుత్వం ఇచ్చిన మ్యాచింగ్ గ్రాంట్‌తో రంగస్థల ప్రదర్శనలకు కావాల్సిన అన్ని హంగులతో ఆడిటోరియం నిర్మించారు. నాలుగు దశాబ్దాలుగా క్రమం తప్పకుండా రాష్ట్ర స్థాయి నాటక ప్రదర్శనలను నిర్వహిస్తోంది.

సహృదయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ

డా.ఏవీ నర్సింహారావు, వనం లక్ష్మీకాంతారావు, దర్శశయనం శేషాచార్య, జి.గిరిజా మనోహర్ బాబులు 1996లో దీనిని స్థాపించారు. మూడు దశాబ్దాల సాహిత్య సాంస్కృతక కార్యక్రమాల నిర్వహణలో ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. హనుమ కొండ వేదికగా అంతర్ రాష్ట్ర స్థాయిలో ఆహ్వాన నాటక పోటీలను నిర్వహిస్తున్నది. భావితరాలు నాటక కళను కొనసాగించే దిశగా బాలల నాటక పోటీలను కూడా నిర్వహిస్తోంది.

చైతన్య కళా సమాఖ్య..

తొర్రూరులోని చైతన్య కళాసమాఖ్య కూడా నాటక రంగాన్ని బతికించేందుకు తన వంతు కృషి చేస్తోంది. 25 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ కళా సంస్థ ప్రతీ ఏటా క్రమం తప్పకుండా రాష్ట్ర స్థాయి నాటకాలను నిర్వహించి తద్వారా రంగ స్థల కళాకారులను ప్రోత్సహిస్తోంది. నాటక ప్రదర్శనలకు సొంతంగా ఒక ఆడిటోరియం కూడా సమకూర్చుకున్న ఈ సంస్థ రంగ స్థల కళాకారుల సంక్షేమానికి ఇతోధికంగా కృషి చేస్తోంది.



ఓ సన్నివేశంలో నటిస్తున్న కళాకారులు

కాకతీయ కళా సమితి..

పాములపర్తి సదాశివరావు 1942లో కాకతీయ కళా సమితిని స్థాపించి అనేక నాటక ప్రదర్శనలు ఇప్పించారు. ఈ సమితి ప్రదర్శించిన నాటకాల్లో చంద్రగుప్త, మధుసేవ, ప్రతాపరుద్రీయం, ఖిల్జీ రాజ్యపతనం ఉన్నాయి. కాకతీయ కళా సమితితో నటుడుగా పేరుపొందిన రఘుపతిని పృధ్వీరాజ్ కపూర్ బొంబాయి పిలిపించుకొని తన నాటకాల్లో నటింపచేశారు. త తర్వాత వచ్చిన డాక్టర్ బుచ్చిరాజు శారద నాట్య మండలి, ముచ్చర్ల సత్యనారాయణ వాణీ నికేతన్ నాట్య మండలి నాటక సమాజాలు కూడా వరంగల్‌లో నాటకాలకు జీవం పోశాయి. పద్య నాటకం పట్ల అభిమానం ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు ములుగు రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఒక వర్క్‌షాపు తమ కార్యస్థానంగా చేసుకొని తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్‌గా ఏర్పడి ఏటా పది నాటకాలకు తగ్గ కుండా పద్యనాటకాలను ప్రదర్శించారు. వరంగల్‌లో రంగస్థల విస్తృతికి విశేషంగా కృషి చేసిన సంస్థల్లో ప్రేక్షక సభ ఒకటి. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సంస్థ నాటక ప్రదర్శనలను ప్రోత్సహించడమే కాకుండా లబ్ధప్రతిష్టులైన రంగస్థల నటులను ఆహ్వానించి వర్క్‌షాపుల ను నిర్వహించింది. రాష్ట్ర స్థాయిలో కళాకారుల సమస్యలను పరిష్కరిం చేందుకు ఏర్పడిన సంస్థ ఇది. 1999లో నేరెళ్ల వేణుమాధవ్ గౌరవాధ్యక్షు డిగా, భండారు ఉమామహేశ్వర్ రావు వ్యవస్థాప అధ్యక్షులుగా ఏర్పాట యింది. ఈ సంస్థ తెలంగాణ స్థాయి నాటక పోటీలను నిర్వహించ డమే కాకుండా రంగస్థల కళాకారుల సమస్యలపై పోరాడుతోంది.

పద్య నాటకాల జోరు..

1950 తర్వాత పద్యనాటకాలకు ఆదరణ పెరిగింది. ఆజంజాహి మిల్స్ ఆర్ట్స్ అసోసియేషన్, మంజూ ఆర్ట్స్ అసోసియేషన్, మారుతీ నాట్య మండలి, హిందూ డ్రమెటిక్ అసోసియేషన్, శ్రీ రాజరాజేశ్వరీ నాట్య మండలి, శ్రీ శారదా నాట్య మండలి తదితర నాట్య మండళ్లు వందలాది పద్యనాటక ప్రదర్శనలిచ్చాయి. ఇవి ప్రదర్శిం చిన వాటిలో రామదాసు, ప్రతాపరుద్రీయం, వర విక్రయం, చింతామణి, సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణ రాయబారం, ఉద్యోగ విజయాలు, శ్రీ రామాంజనేయ యుద్ధం, లవకుశ విశేషాదరణ పొందాయి.

రంగస్థల ప్రముఖులు..

వరంగల్ వేదికగా అనేక నాటక ప్రదర్శనలిచ్చి అనేక మంది పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. పాలెం రఘుపతి, పగడాల త్యాగరాజు, చాట్ల శ్రీరాములు, బీవీ రంగారావు, మెహర్బాన్ అలీ, విజయకుమార్ (విజ్జీ), నంది రాజారెడ్డి, డాక్టర్ రమణ తదితరులు ఎందరో ఉన్నారు. త్యాగరాజు అనేక సినిమాల్లో విలన్‌గా రాణించారు. కక్కెర కొమురయ్య, ఎస్‌కే గౌడ్, జనగామకు చెందిన గంగిశెట్టి చిరంజీవులు, కె.జయకర్‌రావు, కాశీపేట తరుమలయ్య, వొల్లాల నర్సయ్య గౌడ్, నాంపల్లి మధుబాబు, కాసర్ల మధుసూదన్ రావు (మధు), సిరికొండ మాధవరావు, తుమ్మ రవీందర్, సుంకనపల్లి రాజ్‌కుమార్, పి. శేఖర్ బాబు తదితరులు ఎందరో తమ నటన ద్వారా నాటకరంగానికి ఊపిరులు ఊదారు.

ప్రయోక్తలుగా...

చాట్ల శ్రీరాములు అనేక నాటకాల్లో నటించి గొప్ప నటుడుగా పేరుపొందడమే కాకుండా పలు నాటకాలు రచించి, దర్శకత్వం కూడా వహించారు. పిఎస్ విజయకుమార్, పాలెం రఘుపతి, మర్రిరెడ్డి లాంటి దర్శకులెందరో రంగస్థలమే ఊపిరిగా జీవించారు. తూము రామదాసు, శేషాద్రి వెంకటరమణ కవులు, డాక్టర్ పీవీ రమణ, డాక్టర్ వనం మధుసూదన్, అంకం లింగమూర్తి వంటి నాటక రచయితలు భిషగ్విజయం వంటి ప్రతీకాత్మక నాటకాలు, కొత్త రచనా ప్రయోగంతో వచ్చిన అమ్మయ్యో గాంధీ బ్రతికాడు లాంటి నాటక ప్రదర్శలతో రంగస్థలానికి నూతన ఒరవడులు దిద్దారు. ఎస్ఎన్ చారిగా సుపరిచితులైన సిద్దోజు నరసింహాచారి నటుడిగా, దర్శకుడిగా, ప్రయోక్తగా, రచయితగా కళాలోకంలో ప్రత్యేక చోటు సంపాదించుకున్నారు. విధివ్రాత అనేక నాటకంలో సుగుణ పాత్ర వేయడంతో ఈయన నటజీవితం ప్రారంభమైంది. తాను స్వయంగా నటించి దర్శకత్వం వహించిన నాటకాల్లో అంతర్వాణి, అల్లిముఠా, కనువిప్పు, రెండు ఇంటు రెండు ఆరు, దేవతలెత్తిన పడగ, ప్రతాపరుద్రీయం మొదలైవని ఉన్నారు.

అందుబాటులో పలు వేదికలు

గతంలో నాటకాలను ప్రదర్శించేందుకు అనువైన వేదికలు ఉండేవి కావు. దీంతో కళాకారులు నాటకాలు ప్రదర్శించేందుకు ఇబ్బందులు పడేవారు. వరంగల్ పోతన విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో దానికి ఎదురుగానే పోతన ఓపెన్ థియేటర్ నిర్మాణం జరిగింది. ఇక్కడ కొన్నాళ్లు నాటకాలను ప్రదర్శించారు. కానీ ఇందులో సౌకర్యాలు లేకపోవడం తర్వాత అది కనుమరుగు కావడంతో మళ్లీ ఇబ్బందులు ఎదురయ్యాయి. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నేరేళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణం పేరుతో వేదిక అందుబాటులోకి వచ్చిన తర్వాత కళాకారులకు కొంత ఊరట కలిగించింది. ప్రస్తుతం రూ.70 కోట్ల వ్యయంతో హయగ్రీవాచారి గ్రౌండ్‌లో అన్ని హంగులతో కూడిన ఆధునాతన వేదిక కాళోజీ కళాక్షేత్రం అందుబాటులోకి రావడంతో నాటక ప్రదర్శనలకు కొత్త ఊపిరి అందినట్లయింది. ఇటీవలే ఇందులో సహృదయ సంస్థ రాష్ట్ర స్థాయి నాటక పోటీలను నిర్వహించింది.

నాటక సమాజాలు

తర్వాత కాలంలో నాటకాల పట్ల అభిరుచి ఉన్నవారు ఒక్కదగ్గర చేరి నాటక సమాజాలను ఏర్పాటు చేసి నాటకాలను ప్రదర్శించించడం ప్రారంభించారు. అలాంటి వాటిలో వరంగల్ కాకతీయ కళాసమితి, వర్ధన్నపేట భారతీయ నాటక కళా సమితి, జనగామ జ్యోతిర్మయి డ్రమెటిక్ అసోసియేషన్, డోర్నకల్ శ్రీరామ కళాపరిషత్తు, కాజీపేట కళా సమితి, హనుమకొండలో సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ, ప్రేక్షక సభ చెప్పుకోదగ్గవి. వీటిలో కొన్ని కనిపించరేండా పోయినా భారతీయ నాటక కళాసమితి, సహృదయ వంటి సంస్థలు ఇప్పటికీ రాష్ట్ర స్థాయి నాటక పోటీలను నిర్వహిస్తు నాటకాన్ని బతికిస్తున్నాయి.

కొత్తపోకడలు..

వరంగల్‌లో నాటక రంగం పలు కొత్త పోకడలు పోయింది. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా, మారుతున్న కాలానికి అనుగుణంగా నాటక ప్రదర్శనలను మలిచారు. సౌండ్ అండ్ లైట్ సిస్టమ్, భారీ సెట్టింగ్‌లతో నాటకాలను ప్రదర్శించారు. రాణీరుద్రమదేవి, సమ్రాట్ ప్రతాపరుద్ర, కాకతీయ వైభవం లాంటి నాటకాలను భారీ సెట్టింగ్‌లతో ప్రదర్శించారు. కాకతీయ ఉత్సవాల్లో ఇవి ప్రత్యేక ఆదర్శణగా నిలిచాయి. 2002లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో ప్రదర్శించిన మూడవ పాదం నాటకానికి నంది అవార్డు తెలుగు నాటక రంగంలో వరంగల్‌కు ఉన్న స్థానం ఏమిటో స్పష్టమవుతుంది.

ఉగాది కవి సమ్మేళనం

ముందే కూస్తున్న కవితాగానం!

- నేడు, రేపు నగరంలో కవి సమ్మేళనాలు
- మొదలైన ఉగాది సందడి

హనుమకొండ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశ్వవసు ఉగాది వేడుకలు ఈసారి నగరంలో ముందస్తుగానే మొదలయ్యాయి. యేటా ఉగాది పర్వానికి ప్రత్యేకమైన పంచాంగ పఠనాలు, కవి సమ్మేళనాలకు నగరంలోని పలు సంస్థలు సమాయత్తం అయ్యాయి. వరంగల్ దర్శిన్ ఆధ్వర్యంలో వరంగల్ దర్శన్ ఆధ్వర్యంలో విశ్వవసు నామ ఉగాది వేడుకలు గురువారం సాయంత్రం 5 గంటలకు నక్కలగుట్టలో జరగనున్నాయి. బ్రహ్మశ్రీ జగన్‌మోహన్‌శర్మ ఆధ్వర్యంలో పంచాంగ పఠనంతోపాటు పది మంది కవులు పాల్గొనే కవి సమ్మేళనం, ఉగాది పచ్చడి లాంటి సంప్రదాయ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు పెండెం రమేశ్‌బాబు చెప్పారు. అలాగే హనుమకొండలోని ప్రసిద్ధ రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గురువారం సాయం త్రమే ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల రవి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈ కవి సమ్మేళనం సుమారు 20 మంది కవులు పాల్గొని ఉగాది కవితాగానం చేయనున్నారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ వరంగల్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండ ఏషియన్‌మాల్ సమీపంలోని షిరిడీ సాయి బాబా వేడుకల మందిరంలో ఉగాది కవి సమ్మేళనంతో పాటు పెద్దఎత్తున ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు కార్యక్రమ ప్రధాన నిర్వాహకుడు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ చెప్పారు. భాషోపాధ్యాయ సంస్థ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే ఈ వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ డీఈవోలు జ్ఞానేశ్వర్, వాసంతిలతోపాటు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని ఈసారి తెలుగు, హిందీతో పాటు ఆంగ్ల భాషా ప్రావీణ్యులను పలువురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను కూడా సత్కరింపజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విశ్వవసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ములుగురోడ్‌లోని గురుధామంలో శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. డాక్టర్ కంఠెం లక్ష్మీనారాయణ, పాలకుర్తి లక్ష్మీనర్సింహమూర్తిశర్మ లాంటి పండితులను సత్కరిస్తామని ప్రత్యేక పంచాంగ శ్రవణం నిర్వహిస్తామని వారు చెప్పారు. ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉగాది పర్వదిన వేళ ఆదివారం సాయంత్రం 5 గంటలకు పంచాంగ పఠనం ప్రత్యేక కవి సమ్మేళనం కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. వరంగల్‌లోని పద్మశాలీ ఫంక్షన్ హాలులో కృష్ణవేణి కళాసమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5గంటలకు ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పట్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈసారి ఉగాది పర్వానికి ముందే పలు సంస్థలు ఉగాది కవి సమ్మేళనాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తుండటం విశేషం. సహృదయ ఆధ్వర్యంలో కూడా ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహర్ తెలిపారు.



నరేంద్రాంధ్ర భాషా నిలయం

కాళేశ్వరానికి కొత్త శోభ

- మంత్రి చొరవతో రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు
- ముమ్మరంగా సాగుతున్న పనులు

మహదేవపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : త్రివేణి సంగమమైన కాళేశ్వరానికి కొత్త శోభ సంతరించుకుంటోంది. తెలంగాణలో జరుగనున్న సరస్వతీ పుష్కరాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో రూ. 25 కోట్లను విడుదల చేసి అభివృద్ధి పనులకు ముందడుగు వేసింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో త్రివేణి సంగమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. వేసవి కాలం కావడంతో భక్తులకు నీడ ఉండే విధగా చలువ పందిళ్లు, తాగునీటి వసతి, జల్లు, స్నానాలకు ప్రత్యేక గదులు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ఆలయంలో భక్తులు దర్శనానికి క్యూ లైన్లు, సరిపడా ప్రసాద విక్రయ కేంద్రాలు, తదితర ఏర్పాట్లను చురుగ్గా చేపడుతున్నారు. పుష్కర ఘాట్లలో భక్తుల స్నానాలుకు వీలుగా గాట్ల నిర్మాణం జరుగుతుంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న రోడ్లన్ని సీసీ రోడ్లుగా మారుతున్నాయి. భక్తులకు సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఆలయంలో చిన్నా చితక మరమ్మతు పనులను సైతం పూర్తి చేస్తున్నారు.



కాళేశ్వర పరిసరాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

ఎంజాయ్.. రంజాన్

- పర్వదినానికి అందుబాటులో అందమైన దుస్తులు
- మహిళలు, యువతులు, చిన్నారుల కోసం ప్రత్యేక మోడళ్లు
- మండిబజార్‌తో సహా కిటకిటలాడుతున్న పలు దుకాణాలు



చుడీదార్లను కొనుగోలు చేస్తున్న ముస్లిం యువతులు

కరీమాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది. 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్ష పాటించి.. పండుగ రోజున ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి పండుగను సంతోషంగా జరుపుకుంటారు. రంజాన్ నెల వచ్చిందంటే షాపింగ్ మాల్స్ వారు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తారు. ఒక చీర కొంటే మరొకటి ఫ్రీ అంటూ ఆకర్షించే ప్రయత్నాలు చేస్తుంటారు. అదేవిధంగా యువత నూతన వస్త్రాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. కొందరు రెడీమేడ్ డ్రెస్సులపై ఆసక్తి కనబరిస్తే, మరి కొందరు మంచి డ్రెస్ మెటీరియల్ తీసుకొని వాటికి ఆకర్షణీయమైన వర్క్‌లు చేయించుకుంటారు. కానీ ఎక్కువ మంది చుడీదార్‌లకే ప్రాధాన్యమిస్తారు. ఇందులో పటియాలా, బాజీరావు మస్తానీ, రకాలతో పాటు అనేక మోడల్స్ అందుబాటులో ఉన్నాయి. యువతులను మురిపిస్తున్న మరో డ్రస్ లాంగ్ ఫ్రాక్. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ముస్లిం యువతులు లంగా ఓణీలకే మొగ్గు చూపుతున్నారు. వీటిలో సిల్క్, హాఫ్ పట్టు, బెనారస్, తదితర మోడళ్లున్నాయి.

చిన్నారుల ఆనందమే నిజమైన పండుగ

పండుగ వాతావరణం కనిపించేది ముందుగా చిన్నారుల్లోనే. వారి కోసం మార్కెట్లో కళ్లు చెదిరే మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధర రూ.500 నుంచి రూ.5వేల వరకు ఉన్నాయి. మోడల్, నాణ్యతను బట్టి ధరలుంటున్నాయి. చిన్నారులకు లాంగ్, షార్ట్ ఫ్రాక్‌లు చాలా ఉంటాయి. ఇందులో నెట్టెడ్, తదితర డ్రస్సులకు నేడు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. జీన్స్ ప్యాంట్‌తో ప్రత్యేకమైన టాప్‌తో పిల్లలు చాలా ఆనందంగా, అందంగా కనిపిస్తారు. ఇక ఫ్యాన్సీ డ్రెస్సుల సంగతి చెప్పనక్కర్లేదు. వీటిలో సుమారు 50 నుంచి 100 మాడల్స్ వరకు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వరంగల్ మండిబజార్ సహా వరంగల్, హనుమకొండల్లోని పలు షాపింగ్ మాల్స్, దుకాణాల్లో షాపింగ్ సందడి కనిపిస్తోంది.

అతివలకు అందాన్నిచ్చే ఫ్యాన్సీ హారాలు

రంజాన్ పండుగ సందర్భంగా చిన్నారుల దగ్గరినుంచి యువతులు, మహిళలు, అంతా కూడా డ్రెస్సులతో పాటు ఆభరణాలకు కూడా ప్రాధాన్యమిస్తారు. ఇందులో డ్రెస్సులకు సరిపడే ఫ్యాన్సీ హారాలను ధరిస్తుంటారు. వీటిలో స్టోన్‌వర్క్‌తో పాటు, పూసలు, సాదా హారాలు కూడా ఉంటాయి. చిన్నారులు, యువతులు, పూసలు, స్టోన్ వర్క్ ఉండే గొలుసులను ధరిస్తుంటారు. రంజాన్ సందర్భంగా వరంగల్ మండి బజార్ ప్రాంతం ముస్లింలతో కిక్కిరిసి పోతుంది. వీరి అభిరుచులకు తగినట్లుగా వ్యాపారులు చెన్నై, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, తదితర ప్రాంతాల నుంచి సరికొత్త మోడల్స్‌ను తీసుకొచ్చి అమ్ముతారు. వీటి ధర మాడల్స్, డిజైన్‌ను బట్టి రూ.1000 నుంచి రూ.10వేల వరకు ఉన్నాయి. అంతే కాకుండా ప్రత్యేకంగా తయారు చేసిన లహెంగా స్పెషల్ రూ.25వేల విలువైన మాడల్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ తరహా వస్త్రాలను కోల్‌కతా, ఢిల్లీ, సూరత్, బొంబాయి, అహ్మదాబాద్ ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న డ్రెస్‌లు



పలు రకాల మోడల్ డ్రెస్సులు

మండు వేసవిలోనూ.. గంగమ్మ గలగల

- బోరు బావుల్లో నుంచి ఉబికి వస్తున్న జలధారలు
- సీజన్ ఏదైనా నిరంతరం నీటి లభ్యత
- గిరిజన రైతులకు తీరుతున్న సాగు, తాగునీటి కష్టాలు



తొండ్యాల లక్ష్మీపురంలో బోరు నుంచి ఉబికి వస్తున్న జలధార

మంగపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు మండు టెండలు, మరోవైపు తాగునీటికి అవస్థలు. గొంతు తడుపుకుందామంటే గుక్కెడు నీళ్ల దొరకని పరిస్థితి. ఒక్కమడి తడుపుదామన్నా చుక్క నీరు అందని దుస్థితి. తలాపున జీవనదులున్నా తప్పని తండ్లాట. బిందెడు నీటి కోసం కిలో మీటర్ల కొద్దీ కాలినడకన వెళ్లి చెలిమెలను ఆశ్రయించాల్సిందే. అయితే ఇలాంటి సమస్య లేనే లేదని అంటున్నారు మంగపేట మండలంలోని తొండ్యాల లక్ష్మీపురం గ్రామ గిరిజనులు. నీటి కటకట అంటే ఏమిటో తమకు తెలియదంటున్నారు. ప్రకృతి సిద్ధంగానే నిరంతరంగా తాము నీటి సౌకర్యాన్ని పొందుతున్నామని చెబుతున్నారు. సీజన్ ఏదైనా నీటికి కరువు లేదని అంటున్నారు. వేసవిలోను పుష్కలంగా నీళ్ల దొరుకుతున్నాయని గిరిజనులు ఆనందంగా చెబుతున్నారు. మంగపేట మండలంలోని తొండ్యాల లక్ష్మీపురం శివారులో పాతాళ గంగ ఎగిసి పడుతోంది. మోటర్ అవసరం లేకుండానే బోరుబావుల్లో నుంచి నిరంతరంగా జలధార ఉబికి వస్తూనే ఉంది. గ్రామానికి కుడివైపు భాగాన ఇలాంటి బోర్లు 16కు పైగా ఉన్నాయి. ఈ గ్రామంలో కుడి వైపు పొలాల్లో ఉన్న 300 అడుగులపైగా బోర్ల నుంచి ఆశ్యర్యంగొలిపేలా నీరు ఉప్పొంగుతోంది. ఈ గ్రామ తీరంలో చమురు నిక్షేపాల కోసం 32 ఏళ్ల క్రితం మొదటి సారిగా పొదెం లక్ష్మయ్య అనే గిరిజన ఉద్యోగి సాగు భూమిలో బోరు వేయగా.. చమురు ఆనవాళ్లు లభించకపోయినా గోరువెచ్చటి నీరు ఉబికి వచ్చినట్లు కొందరు చెబుతున్నారు. ఆ తర్వాత ఏటూరునాగారం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటైన తర్వాత గిరిజన రైతులకు సాగునీటి అవసరాలు తీర్చేందుకు రెండు బోరు బావులను తవ్వించారు. ఈక్రమంలో తొండ్యాల లక్ష్మీపురంలో 300లోతు తవ్వగానే జల తాకింది. అంత లోతు నుంచి కూడా మోటర్ అవసరం లేకుండానే నిరంతరం నీరు ఉబికి వస్తుండటం విశేషం. ఇదేక్రమంలో వైఎస్ఆర్ హయాంలో ఇందిర జలప్రభ పేరుతో గిరిజన రైతులకు ఆరు బోర్లను తవ్వించగా అక్కడ కూడా ఇదేవిధంగా పాతాళం నుంచి ఎగిసిపడింది. ఇలా సుమారు 16 బోర్ల నుంచి నిరంతరంగా నీరు వస్తూనే ఉంది. వీటి కింద సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో వరి రెండు పంటలు సాగవుతోంది. కరెంట్ కష్టాలు, మోటర్లు కాలిపోవడం లాంటి సమస్యలు లేకుండానే గిరిజన రైతులు ఈ జలధారలతో పంటలు పండించుకొంటున్నారు. కొందరు ఈ నీటిని తాగడానికి కూడా వినియోగిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అవక్షేప శిలాజాలు ఉన్నాయని, అందుకే అక్కడ భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయని, బోర్లు వేసినప్పుడు భూమి పొరలోపల శిలాజాలు ఉన్నా. నీరు బయటకు వస్తుందని కాకతీయా యూనివర్శిటీ జువాలజి ప్రొపెసర్స్ కొందరు చెబుతున్నారు. బోరు ఉపరితల భాగం కంటే శిలలు ఇంకా ఎత్తులో ఉండటం వలన ఆ ఒత్తిడికి నీరు పైకి ఉబికి వస్తుందని. ఇది ఎక్కువగా అవక్షేప స్థితిలో ఉన్నటువంటి ప్రాంతంలో కనబడుతుందని వాటిని ఆర్టేషన్ బోర్లు అంటారని ప్రొపెసర్లు చెబుతున్నారు.



ఉబికి వస్తున్న నీటిని పైప్‌తో పంటలకు తరలిస్తున్న రైతులు

బోరు బావులను గిరిజన రైతులకు మంజూరు చేయాలి



నీరు సమృద్ధిగా ఉబికి వస్తుంది కాబట్టి గ్రామ శివారులో గల భూములున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం బోరుబావులను మంజూరు చేస్తే బాగుంటుంది. ప్రభుత్వం సర్వేలు చేసి బోరుబావులను మంజూరు చేస్తే రెండు పంటలతో పాటు నీటి కొరత లేకుండా అవుతుంది. దీని కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

జబ్బ సమ్మయ్య, రైతు, తొండ్యాల లక్ష్మీపురం



చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలి

మట్టెవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలు ధరించడంతోపాటు, చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని వరంగల్ డివిజన్ టెస్కో మండల వాణిజ్య అధికారి బొట్టు వెంకటేశ్వర్లు అన్నారు. ఉగాది, రంజాన్ పండుగలతో పాటు పెళ్లిల్ల సందర్భంగా బుధవారం టెస్కో మెగా షోరూం నుంచి కార్యకర్యలు ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొట్టు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉగాది, రంజాన్, వివాహ వేడుకల సందర్భంగా అన్నిరకాల చేనేత వస్త్రాలపై 30శాతం తగ్గింపుతో, ఇక్కత్ సిల్క్ చీరలపై 40శాతం తగ్గింపుతో వస్త్రాలను విక్రయిస్తున్నామన్నారు చేనేత వస్త్రాలను, పరిశ్రమను ప్రోత్సహించేందుకుగాను ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.



వరంగల్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న టెస్కో సిబ్బంది

శిక్షణలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం

ఇంజారపు పూజ, పీటీసీ ప్రిన్సిపాల్, మామునూరు



ముఖాముఖి

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు మీ ఆధ్వర్యంలో ఎంత మందికి శిక్షణ ఇచ్చారు..?

ప్రిన్సిపాల్: 6 బ్యాచ్‌లలో కలిపి 6,857 మంది పోలీసులకు శిక్షణ ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: కొత్త న్యాయ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారా?

ప్రిన్సిపాల్: అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీలచే ట్రెయినీ పోలీసులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇండోర్, ఔట్‌డోర్ ఫ్యాకల్టీలో ఎంత మంది ఉన్నారు..?

ప్రిన్సిపాల్: ఇండోర్, ఔట్‌డోర్ ఫ్యాకల్టీలలో మొత్తం 100 మంది సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: శిక్షణ సమయంలో ట్రెయినీ పోలీసులకు ఎలాంటి ఆహారాన్ని అందిస్తున్నారు..?

ప్రిన్సిపాల్: ఆరోగ్యంతో పాటు శరీర ధృడత్వాన్ని పెంచేలా పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసులకు మీరు ఇచ్చే సూచనలు ?

ప్రిన్సిపాల్: పోలీసు అంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదు. సమాజంలో బాధ్యత గల కర్తవ్యం. విధుల్లో చేరిన తరువాత నీతి, నిజాయితీతో పనిచేయాలని సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వరంగల్ జిల్లా పీటీసీ ప్రత్యేకతలు ఏంటి..?

ప్రిన్సిపాల్: వరంగల్ పీటీసీ(పోలీస్ ట్రైనింగ్ కాలేజీ)లో 14 ప్యాబ్రికేటెడ్ బ్యారెక్స్, గ్రిడ్ మిర్రర్, 14 క్లాస్‌రూమ్స్, 600 మందికి ఒకేసారి సమావేశం నిర్వహించే గది ఉన్నాయి.

మామునూరు (ఆంధ్రజ్యోతి)


వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన ఈ-సమ్మిట్ 6.0 లో పాల్గొన్న అతిదులు, ఎంట్రప్రెన్యూర్‌లు



మాట్లాడుతున్న రామనాథన్, జయప్రకాశ్ నారాయణ

విద్యార్థులు ఆలోచనలకు రూపం ఇవ్వాలి

- పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి
- సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం చైర్మన్ రామనాథన్
- వాగ్దేవి కళాశాలలో ఘనంగా ఈ సమ్మిట్ 6.0
- హాజరైన ప్రముఖులు- ఆకర్షణగా నిలిచిన ఎగ్జిబిట్లు

శంభునిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యార్థులు తమ ఆలోచనలకు రూపం ఇచ్చి ఆవిష్కరణలుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం చైర్మన్ శ్రీమనాన్ రామనాథన్ సూచించారు. వరంగల్ బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో విశ్వంభర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఈ సమ్మిట్ 6.0 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామనాథన్, విశిష్ట అతిథులుగా ఐఐటీ హైదరాబాద్ వ్యవస్థాపక డైరెక్టర్ యూబీ దేశాయ్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేపీ చౌదరి, వాగ్దేవి కళాశాల వ్యవస్థాకుడు చందుపట్ల దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా రామనాథన్ మాట్లాడుతూ.. నగరాలతో పాటు గ్రామాలలోనూ సాంకేతిక పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలన్నారు. ఐఐటీ వ్యవస్థాపక డైరెక్టర్ యూబీ దేశాయ్ మాట్లాడుతూ.. సాంకేతిక విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత పరిశోధనలు చేయాలన్నారు. సమాజానికి ఉపయోగపడేలా ప్రాజెక్టులను రూపొందించాలని కోరారు.

లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. ప్రపంచ మేధస్సుకు భారతదేశం రాజధాని అని వర్ణించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని యువత సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. వాగ్దేవి విద్యాసంస్థల చైర్మన్ చందుపట్ల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక నైపుణ్యాలు, స్టార్టప్‌ల వ్యవస్థాపనల్లో విదేశాల్లోనూ భారతీయులదే హవా అని అన్నారు. స్టార్టప్‌లను, యువ ఎంట్రప్రెన్యూర్స్‌ను ప్రోత్సహించేందుకుకే ఈ సమ్మిట్‌ను నిర్వహించామన్నారు.

అనంతరం వివిధ కంపెనీల పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, సాంకేతిక నిపుణులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వాగ్దేవి విద్యాసంస్థల అధ్యక్షుడు చందుపట్ల దేవేందర్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రెసిడెంట్ వాహినీదేవి, డైరెక్టర్ వాణీదేవి, సీఈవో సలీం జివానీ, సంవిన్ సీఈవో కె.సాయికిరణ్, డైరెక్టర్‌లు, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, సుమారు 2500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కంటెం లక్ష్మీనారాయణకు ఉగాది పురస్కారం



వరంగల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఎస్‌జీఐఎస్ దత్తజ్ఞాన బోధ సభ ట్రస్టు సభ్యుడు డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణకు శివానంద గురు కల్చరల్ ట్రస్టు ఉగాది పురస్కా రం ప్రకటించింది. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా సద్గురు శివానందమూర్తి దివ్య సన్నిధి సప్తధామంలో ఈ నెల 30వ తేదీన ఉగాది పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్, ట్రస్టీ బండారి సాయినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కంటెం లక్ష్మీనారాయణతో పాటు భద్రకాళి దేవస్థానం వేద పండితుడు పాలకుర్తి నర్సింహమూర్తి శర్మకు ఉగాది పురస్కారాలు అందజేస్తామన్నారు.

గుట్కాలు స్వాధీనం

వరంగల్ క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ బస్టాండ్‌లో మహిళ నుంచి గుట్కాలు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు వరంగల్ బస్టాండ్‌కు ఇన్స్‌పెక్టర్ లవణ్‌కుమార్ టీం చేరుకొని సోదాలు చేయగా మహబూబాబాద్ టౌన్‌లోని గుండ్లకుంట కాలనీకి చెందిన సింగిరికొండ విజయలక్ష్మీ వద్ద ప్రభుత్వ నిషేధిత గుట్కాలు పట్టుబడ్డాయన్నారు. ఆమె నుంచి రూ.53,000 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించామన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య


సుదర్శన్ (ఫైల్)

గిర్మాజీపేట,మార్చి26 (ఆంధ్ర జ్యోతి): వరంగల్ రైల్వేగేటు సమీపంలో మంగళవారం రాత్రి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నారు. వరంగల్ జీఆర్‌పీ సైఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్.ఆర్.ఆర్ తోట ప్రాంతానికి చెందిన కందగట్ల సుదర్శన్ (73) వయోభారంతో పాటు మానసిక, శారీరక సమస్యలతో బాధపడుతూ మంగళవారం రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి వెళ్లి రైల్వేగేటు సమీపంలో గూడ్స్‌రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సుదర్శన్‌ను స్థానికులు పక్కకు తీసి కుటుంబసభ్యులను రప్పించి ఆటోలో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి సుదర్శన్ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం బుధవారం మృతదేహాన్ని కుమారుడు రామ్ కుమార్‌కు అప్పగించి హెడ్ కానిస్టేబుల్ జి.సుదర్శన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ మహిళలకు చీరెల పంపిణీ

ఖిలావరంగల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని 37వ, డివిజన్ పోచమ్మదేవాలయం వద్ద బుధవారం వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కాకతీయ రుద్రమాంబ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బైరబోయిన సరోజన అధ్యక్షతన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య- లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులకు చీరెలను పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్‌ను శాలువా, షీల్డుతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తోట చంద్రకళ, మామునూర్ అరుణ, ధనలక్ష్మి, హేమలత, వెంకటలక్ష్మి, బస్వరాజు జ్యోతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పిన్‌పాయింట్ ప్రోగ్రామ్‌ను అమలు చేయాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే


పిన్ పాయింట్ ప్రోగ్రామ్ బుక్‌లను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శానిటేషన్ నిర్వహణ సమర్థవంతంగా జరగాలంటే పిన్‌పాయింట్ ప్రోగ్రామ్‌ను తప్పకుండా అమలు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ 61వ డివిజన్ సిద్ధార్థనగర్‌లో బుధవారం కమిషనర్ శానిటేషన్‌తో పాటు ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పిన్‌పాయింట్ బుక్స్ నిర్వహణ చేయని శానిటేషన్ సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేయాలని అన్నారు. ఇంకా పారిశుధ్య సిబ్బంది స్వీపింగ్ డ్రైన్ క్లీనింగ్‌లకు సంబంధించిన లాగ్‌బుక్‌లను కచ్చితంగా రాయాలని అన్నారు. ప్రతీ చెత్త తరలింపు వాహనం రెండు ట్రిప్పులు వేయాలని అన్నారు. ట్రేడ్ కలెక్షన్ కోసం ఏర్పాటు చేసిన బృందాలు తప్పకుండా ప్రతీ రోజు రూ.50లక్షల టార్గెట్ చేయాలన్నారు. శానిటేషన్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సిద్ధార్థనగర్‌లో రోడ్డుపై ఇసుకపోసి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న యజమానికి జరిమానా విధించాలని సీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డితో పాటు జవాన్లు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందికి జరిమానా

మట్టెవాడ, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 17 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ సోమవారం రూ23 300 జరిమానా విధించారు. ఇదే కేసులో వరంగల్ స్తంభంపల్లికి చెందిన కొమ్ముల అజయ్‌కు రెండురోజుల సామాజిక సేవ శిక్ష విధించారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ముగ్గురికి రూ.4500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

కేంద్రం సహకరించాలి

జిన్నింగ్ మిల్లుల ఆధునీకరణకు ఆర్థిక సాయమందించాలి

తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి

వరంగల్ వ్యవసాయం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఉన్న జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లుల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయమందించాలని తెలంగాణ కాటన్ అండ్ ఇండస్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశంలో పత్తి ఉత్పత్తి, క్వాలిటీ పెంపొందించేందుకు కాటన్ మిషన్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా పత్తి ఉత్పత్తితో పాటు క్వాలిటీ పెంపొదించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం నేషనల్ టెక్స్‌టైల్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో పత్తి ఎగుమతులు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.750 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. దేశంలో కస్తూరిబ్రాండ్ పత్తి రకాలను ఉత్పత్తి చేసేందుకు, ప్రస్తుతం ఉన్న జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమలను ఆధునీకరించేందుకు రూ.40 నుంచి 50లక్షల ఆర్థిక సాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ రూపంలో అందించి పత్తి పరిశ్రమల అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

ఈ సమావేశంలో కాటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా, కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అతుల్ ఎస్.గంట్రా, కాన్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ చైర్మన్ రాకేశ్ మెహర, ప్రధాన కార్యదర్శి చంద్రిమ చటర్జీ, సౌత్ ఇండియా మిల్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ కె.సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనులు పూర్తి చేయండి

- ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్
- హైదరాబాద్‌లో స్మార్ట్‌సిటీ బోర్డు మీటింగ్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో జరుగుతున్న స్మార్ట్‌సిటీ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ సెక్రెటేరియెట్ కార్యాలయంలో 28వ స్మార్ట్‌సిటీ బోర్డు మీటింగ్ జరిగింది. ప్రసుతం వరంగల్ నగరంలో జరుగుతున్న బోర్డు మీటింగ్‌లో వరంగల్ నుంచి బోర్డు సభ్యులు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, స్మార్ట్‌సిటీ అధికారులు భాస్కర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

దానకిశోర్ అధ్యక్షత జరిగిన సమావేశంలో వరంగల్ నగరంలో జరుగుతున్న అబివృద్ధి పనుల గురించి ఇక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం స్మార్ట్‌సిటీ మిషన్‌లో వరంగల్ నగరంలో ఎన్ని పనులు పూర్తి అయ్యాయి? ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి? ఇంకా కొత్తగా చేపట్టే పనులకు ప్రతిపాదనలు ఏమైనా చేశారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బల్దియా పరిధిలో 108 అభివృద్ధి పనులకు 77 పనులు పూర్తి అయ్యాయని, ఇంకా 38 పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రధానంగా భద్రకాళిబండ్, వడ్డెపల్లి బండ్, జంక్షన్ల అభివృద్ధి, ఐసీసీసీ సెంటర్, రోడ్లు, డ్రైనేజీల పనులు పెండింగ్‌లో ఉన్నాయని బల్దియా అధికారులు తెలిపారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నైపథ్యంలో పూర్తి స్థాయిలో మీటింగ్ తీసుకోలేకపోతున్నానని, త్వరలో మరో మారు స్మార్ట్‌సిటీ బోర్డు మీటింగ్ ఏర్పాటుచేసి అన్ని విషయాలు చర్చిస్తామని అధికారులు వెల్లడించారు. కాగా, స్మార్ట్‌సిటీ పనులపై ఇక్కడి అధికారులు చేసిన డొల్లతనం, అవినీతి అక్రమాలపై ఇప్పటికే నిఘా వర్గాలు పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. బల్దియాలో పనిచేస్తున్న కొందరు అధికారులు, పాలక వర్గం పెద్దలు స్మార్ట్‌సిటీ నిధులతో చేసిన నాసిరకం పనుల ద్వారా వచ్చిన కమీషన్‌తో కోట్లు వెనకేసుకున్నట్లు నిఘా వర్గాలు గుర్తించి పూర్తి సమాచారం ప్రభుత్వానికి చేరవేసినట్లు తెలిసింది.

భద్రకాళి హుండీ ఆదాయం రూ. 14.97లక్షలు

వరంగల్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారికి హుండీలలో వచ్చిన నగదును బుధవారం లెక్కించారు. మొత్తం రూ. 14,97,412ల ఆదాయం వచ్చిందని ఈవో శేష భారతి తెలిపారు. ఈ నగదును కేఎంసీలోని యూనియన్ బ్యాంకులో జమ చేశారు. హుండీలలో విదేశీ కరెన్సీ 14 యూఎస్ డాలర్లు, 10 ఇంగ్లాడ్స్ పౌండ్స్, 5 యూఏఈ దిరన్స్, 10 యూరోలు లభించాయి. మిశ్రమ బంగారం, వెండి రాగా విదేశీ కరెన్సితోపాటు వాటిని కూడా తిరిగి హుండీలోనే వేశారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా డి.అనిల్‌కుమార్ రాగా ఈవో శేష భారతి, అర్చకులు భద్రకాళి శేషు, కూచన హరినాథ్, లక్ష్మీశ్రీనివాస సేవా ట్రస్టు, లక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

గిర్మాజిపేట,మార్చి26(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 6 నుంచి ప్రారంభమయ్యే వరంగల్ శ్రీ గోవింద రాజస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను బుధవారం మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని మంత్రి దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 6 నుంచి 26 వరకు జరిగే శ్రీగోవింద రాజస్వామి బ్రహ్మోత్సవాలను అంగ రంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి మంత్రి కొండా సురేఖకు వివరించారు. కార్యక్రమంలో అర్చకులు వరయోగుల ప్రసాద్, మురళీకృష్ణ, సాయిమనోజ్, లక్ష్మణస్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మునిగంటి వరుణ్, న్యాయవాది ఓడపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వరంగల్ చౌరస్తాలో అన్నదానం చేస్తున్న గోపాల్ నవీన్‌రాజ్


అన్నదానం చేస్తున్న టీపీసీసీ చేనేత విభాగం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఘనంగా సుస్మిత పటేల్ జన్మదినం

- మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ
- కేకులు కట్ చేసి అన్నదానాలు చేసిన కార్యకర్తలు

మట్టెవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ యువ నాయకు రాలు, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుల కుమార్తె కొండా సుస్మిత పటేల్ జన్మదిన వేడుకలను బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోపాల నవీన్‌రాజ్ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాతో పాటు పోచమ్మమైదాన్ జంక్షన్‌లో భారీ కేక్‌కటిచేసి అన్నదానం చేశారు. నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. దేవాలయాల్లో పూజలు, చర్చిలలో, మసీదులలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, నాయకులు మబ్బు ప్రవీణ్, తోట వేణుమాధవ్, చిట్టిమల్ల రమేశ్‌బాబు, జన్ను వివేక్, కొక్కుల సతీష్, గుండు పూర్ణచందర్, జారతి రమేశ్, కురిమిల్ల సంపత్, కాసం పున్నం, చిలువేరు శ్రీనివాస్, వేణుగోపాల్, బి.సదానందం, జారతి శ్రీనివాస్, నర్సింగరావు, జారతి వెంకట్, వడ్లకొండ ప్రవళిక, శారద పాల్గొన్నారు.

● గిర్మాజిపేట: కాంగ్రెస్ యువనాయకురాలు కొండా సుస్మితాపటేల్ పుట్టిన రోజు వేడుకలను వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, పార్టీ నాయకుడు గోపాల నవీన్‌రాజు రోగులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మీసాల ప్రకాష్, సోమిశెట్టి ప్రవీణ్, కురిమిల్ల సంపత్, కాసం పున్నంచందర్, జారతి శ్రీనివాస్, రానాసింగ్, భారతి, వెంకట్, ఠాకూర్ భజరంగ్ సింగ్, తోట వేణు తదితరులు పాల్గొన్నారు.

27వ డివిజన్ కొండా పటేల్ కాలనీలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మీసాల ప్రకాష్, గోపాల నవీన్‌రాజ్, దౌడు నాగరాజు పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: కొండా సుస్మితాపటేల్ జన్మదినం సంద ర్భంగా వరంగల్ అండర్‌బ్రిడ్జి వద్ద కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్, పగడాల సతీష్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కన్నోజు లావణ్య, సారా సాంబయ్య, అబ్బోజు తిరుపతి, నామని రాజ్‌కుమార్, మంతిని సంధ్య, శెట్టి రాజేష్, వాసం సోమలక్ష్మి, స్వప్న, జయ, మాధవి, జంపా, సంతోష్, నాగరాజు, రాజేష్ పాల్గొన్నారు.

37వ, డివిజన్ తూర్పుకోటలో డివిజన్ అధ్యక్షుడు బోయిని దూడయ్య ఆధ్వర్యంలో కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బెడిద వీరన్న, సంగర బోయిన చందర్, బంగారి శ్రీనివాస్, షబ్బీర్, ప్రవీణ్, సంగరబోయిన రాజు, చుక్క రాజు, నరేష్, ఐ లయ్య, మేకల కృష్ణ, ప్రభాకర్, అభి, కిరణ్, దేవేందర్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ టౌన్: 23వ డివిజన్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద టీపీసీసీ చేనేత విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సుస్మితా పటేల్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. స్థానిక వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిబోయిన మణి, గోపాల్‌రావు, దామెర రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

23వ డివిజన్ కొత్తవాడలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గొండ రజిత-శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుస్మితా పటేల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలకోటి భాస్కరచారి, పాపుడాల రాము, పిండి శ్రీను, వడ్డేపల్లి సతీష్, తుమ్మ కన్నయ్య, వలస శ్రీను, యాకుబ్‌పాషా పాల్గొన్నారు.

● శంభునిపేట: కొండా సుస్మిత పటేల్ జన్మదినం సందర్భంగా కార్పొరేటర్ పోశాల పద్మస్వామి ఆధ్వర్యంలో శంభునిపేట జంక్షన్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. 42వ డివిజన్‌లో కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్ ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సుస్మిత ముఖ చిత్రంతో ఉన్న భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కేడల పద్మజనార్దన్, ఎలుగు సాంబేశం, మంతిని సునిత, సోమలక్ష్మి పాల్గొన్నారు.

అత్తగారింటికి వచ్చిన అల్లుడు అదృశ్యం

వరంగల్ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండిబజార్‌లో అత్తగారింటికి వచ్చిన అల్లుడు అదృశ్యమయ్యాడు. ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ మండిబజార్‌కు చెందిన చింతల ప్రశాంతికి హైదరాబాద్ బేగంపేటకు చెందిన చింతల మహేష్‌తో 2017వ సంవత్సరంలో వివాహం జరిగింది. కొన్ని రోజులకు భర్త మహేష్ మద్యానికి బానిస కావడంతో ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు కూడా నిర్వహించారు. తరువాత వీరి కాపురం సజావుగా సాగింది. 2022లో వీరికి కుమారుడు జన్మించాడు. ఆ తరువాత మహేష్ మందు మానకపోవడంతో మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో భార్య ప్రశాంతి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో మహేష్ ఈ నెల 22వ తేదీన వరంగల్ మండిబజార్‌లో గల తన అత్తగారింటికి రావడంతో భార్యతో తీవ్రంగా గొడవ జరిగింది. దీంతో తను తిరిగి వెళ్లిపోయాడు. అయితే అతడు బేగంపేటలోని తన ఇంటికి కూడా వెళ్లలేదని తెలుసుకున్న భార్య ప్రశాంతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తను వెళ్లినప్పుడు రెడ్ షర్ట్, బ్లాక్ పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మహేష్ ఆచూకీ తెలిపినట్లయితే 8712685007, 8712685118 సెల్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ షూకూర్ తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

ఖిలావరంగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ దళితకాలనీలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకురాలు, మాజీ కార్పొరేటర్ నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఎం, ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవికాలంలో వారానికోమారు కూడా తాగునీరు రావడంలేదన్నారు. రోడ్లు, డ్రైయినేజీలు పాడై మురుగునీరు రోడ్లపైకి వస్తోందన్నారు. ఈ విషయంలో అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలిచ్చినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించని పక్షంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం, ఐద్వా ప్రజా సంఘాల నాయకులు టి. భవానీ, నలిగంటి విజయ్ పాల్, గుండేటి అనిల్, గొర్రె ప్రవీణ్ పాల్గొన్నారు.

శాటిలైట్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలి

- వరంగల్ రైతులు, కార్మికులకు సహకారంలో శిక్షణ ఇవ్వాలి
- త్రిభువన్ సహకార వర్సిటీ ప్రయోజనం వరంగల్‌కూ అందాలి
- పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య


పార్లమెంట్‌లో త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయ బిల్లుపై మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సహకార రంగ విస్తరణకు శాటిలైట్ క్యాంపస్‌లు అవసరమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అభిప్రాయపడ్డారు. బుధవారం పార్లమెంట్‌లో త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయం బిల్లుపై జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. సహకార రంగంలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాటిలైట్ క్యాంపస్‌లను ప్రోత్సహించాలని సూచించారు. ఇందులో భాగంగా తెలంగాణలో శాటిలైట్ క్యాంపస్‌లు, మొబైల్ శిక్షణ యూనిట్లను ఏర్పాటు చేయాలని కోరారు. వరంగల్ రైతులు, సహకార రంగంలోని కార్మికుల సంక్షేమ కోసం దీనిని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. సహకార రంగంలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు నైపుణ్య వృద్ధి కోసం విశ్వవిద్యాలయ స్థాయి సంస్థలను నెలకొల్పడం హర్షణీయం అన్నారు. త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయం బిల్లు సహకార రంగాభివృద్ధికి ఆశాకిరణం లాంటిదనే చెబుతూనే ఆనిశ్చితిని కూడా కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. వరంగల్ రైతులు, సహకార కార్మికుల సంక్షేమం కోసం దీనిని జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని చెప్పారు. గుజరాత్‌లోని ఆనంద్‌లో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు సహకార రంగంలో శిక్షణ, పరిశోధనకు ఊతం ఇస్తుందని, అయితే వరంగల్ రైతులకు ఇది అందుబాటులో ఉంటుందా అని ఎంపి కావ్య ప్రశ్నించారు. ఇర్మాను విశ్వవిద్యాలయంగా మార్చడం సానుకూలమైనప్పటికీ, గ్రామీణ భారత అవసరాలకు ఇది ఎలా సరిపోతుందని ఎంపీ అడిగారు. తెలంగాణలో శాటిలైట్ క్యాంపస్‌లు, సంచార శిక్షణా యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సహకార ఉద్యోగుల సామర్థ్యం కోసం 5 ఏళ్ల కార్యాచరణ ప్రణాళిక, 50 శాతం గ్రామీణ కార్మికులకు శిక్షణ, పది ప్రాంతీయ కేంద్రాల ఏర్పాటు వంటి లక్ష్యాలను బిల్లులో చేర్చాలని డాక్టర్ కావ్య కోరారు. ఈ బిల్లులో చిన్న రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సమానత్వ దీపస్తంభంగా ఈ బిల్లు ఉపయోగపడాలని పేర్కొన్నారు. సహకార లభ్యత, సమ్మిళిత భావన, పారదర్శకత కోసం ఈ బిల్లును సమర్థవంతంగా రూపొందించాలని సభను కోరారు. గ్రామీణులకూ ఉపకరించే సహకార బిల్లు కోసం వరంగల్, ముఖ్యంగా తెలంగాణ ఎదురుచూస్తోందని అన్నారు.

తగ్గిన పన్నుపోటు!

ఆస్తి పన్ను వడ్డీపై రాయితీ కల్పించిన సర్కారు

- అపరాధ రుసుంపై 90 శాతం ఫీజు రిబేట్
- అసెంబ్లీలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని ప్రస్తావన
- అన్ని మున్సిపాలిటీలకు జీవో జారీ చేసిన ప్రభుత్వం
- చెల్లింపులకు మంచి అవకాశం అంటున్న అధికారులు
- ఇప్పటికి 57 శాతం పన్నుల వసూలు


వ్యాపారుల నుంచి పన్నుల వసూలు చెక్కు స్వీకరిస్తున్న బల్దియా అధికారులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వానికి చెల్లించే పన్నులపై రాయితీ కల్పిస్తోంది. ఆరు మాసాలుగా ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)పై చెల్లించే ఫీజులో 25శాతం రాయితీ కల్పించగా చాలామంది నగరవాసులు, భూ యజమానులు, రియల్టర్లు వినియోగించుకుంటున్నారు. అలాగే ఆస్తిపన్నుపై కూడా సర్కారు రాయితీ ప్రకటించింది. రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో ఇంటి పన్నుల బకాయిలు చెల్లించలేక చాలా మంది గృహ యజమానులు ఇబ్బంది పడుతున్నది దృష్టిలో ఉంచుకుని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గళం విప్పారు. హైదరాబాద్ తరహాలో అస్తి పన్ను అపరాధ రుసుములో 90 శాతం రాయితీ ఇవ్వాలని ప్రతిపాదించారు. అలాగే ఇంటి పన్నులు చెల్లించవలసిన వారు చాలాకాలంగా బకాయిలు ఉన్నట్టు ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా తెలుసుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. పన్నుల చెల్లింపులో తెలంగాణలోని 148 మున్సిపాలిటీలకు భారీగా రాయితీ ప్రకటిస్తూ మంగళవారం రాత్రి జీవో నెంబర్ 109ను విడుదల చేసింది. 2024-2025 ఆర్థిక సంవత్సరాలకు అన్ని పట్టణ, స్థానిక సంస్థలలో ప్రాపర్టీ ట్యాక్స్‌ను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అవకాశం ఇస్తూ గడువుని ప్రకటించింది. ఆస్తిపన్నుకు జత చేసిన అపరాధ రుసుములో 90 శాతం రాయితీ ప్రకటిస్తూ బల్దియా అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో నెల ముందు నుంచే అక్కడి ప్రజలకు ఆస్తి పన్నులో వెసులుబాటు కల్పించడంతో రాష్ట్రంలోని మున్సిపాలిటీలతో పాటు అన్ని మున్సిపాలిటీలకు ఆస్తి పన్నులో వడ్డీలో 90 శాతం రిబేట్ అవకాశం కల్పించినట్టు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ ఉత్తర్వులు వెలువరించారు.

పన్నులపై కన్నెర్ర

ప్రాపర్టీ ట్యాక్స్, నల్లా పన్నులపై ఇప్పటికే వరంగల్ నగరంలోని 66 డివిజన్‌లలో రెవెన్యూ, శానిటేషన్ సిబ్బంది కలియతిరుగుతున్నారు. పన్నులు చెల్లించకుండా మొండి బకాయిదారులుగా ఉన్న వారిని గుర్తించి ముందుస్తుగా రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. నిర్లక్ష్యం వహించే కమర్షియల్ కాంపెక్స్‌లు, షాపులు, ఇండ్ల యజమానుల ఆస్తులను సీజ్ చేస్తున్నారు. ఇప్పటివరకు 168 షాపులు సీజ్ చేసినట్టు బల్దియా అధికారులు తెలిపారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు డిప్యూటీ కమిషనర్లు, ఆర్ఐలు, వార్డు అధికారులు, హెల్త్ అండ్ శానిటేషన్ అధికారులు, శానిటరీ జవాన్ వరకు ఆస్తి పన్నుల వసూళ్లలో ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు చురుకుగా పాల్గొంటున్నారు. అయితే బల్దియా పరిధిలోని 2,86,000 ఇండ్లు, షాపింగ్ మాల్స్ కమర్షియల్ కాంప్లెక్స్‌ల యజమానులను గుర్తించి పన్నులు చెల్లించని వారిపై కన్నెర్ర చేస్తున్నారు. కాగా, 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో బల్దియాకు పన్నుల రూపంలో రూ.117కోట్లు రావాల్సి ఉండగా, బుధవారం వరకు రూ.68.30 కోట్లు వసూలు చేసిట్టు అధికారులు వెల్లడించారు. అంటే 57 శాతం పన్నులు జరిగాయని, మొత్తంగా 97 శాతం టార్గెట్ పూర్తి చేయాలని హైదరాబాద్ సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి ఆదేశాలు ఇవ్వడంతో సిబ్బంది పన్ను వసూళ్లకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

పన్నులు చెల్లించిన వారికి మినహాయింపు

వరంగల్ నగరంలో ఉంటూ యేటా మాదిరిగానే ఈ ఆర్థిక సంవత్సరం 90 శాతం రాయితీ ప్రకటనకంటే ముందే అపరాధ రుసుము, వడ్డీ చెల్లించిన వారికి 2025- 2026 వచ్చే ఆర్థిక సంవత్సరంలో వచ్చే ఫీజులో చెల్లించిన డబ్బులను మినహాయించి ఇంటింటికీ రశీదులు జారీ చేయనున్నారు. అంతే కాకుండా ఎర్లీ బర్డ్ స్కీమ్‌లో భాగంగా ఏప్రిల్ నుంచి వచ్చే మార్చి వరకు ఇంటి పన్నులు ముందస్తుగా చెల్లించే వారికి ఫీజులో 5 శాతం తగ్గింపు చేస్తారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రాపర్టీ ట్యాక్స్ అపరాధ రుసుములో 90 శాతం రాయితీ కల్పించినా డబ్బులు చెల్లించని వారికి ఏప్రిల్ మాసం నుంచి అసలుతో పాటు వడ్డీకి వడ్డీ జమ చేమ చేసి వచ్చే బిల్లులో ప్రకటించనున్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా, ప్రజల సమస్యలు గుర్తించి అసెంబ్లీలో ప్రతిపాదన చేసి ప్రత్యేక జీవో విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


పన్ను చెల్లించని షాపును సీజ్ చేస్తున్న అధికారులు(ఫైల్)

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ నగర ప్రజలు వన్‌టైం సెటిల్మెంట్ (ఓటీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలి. 2024-2025 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను బకాయిలు మొత్తం చెల్లిస్తే 90 శాతం పేరుకుపోయిన వడ్డీ రాయితీలు పన్నులు చెల్లించవచ్చు. మార్చి 31 వరకు వడ్డీ/ ఫెనాల్టీతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలను ఒకే సారి చెల్లించవచ్చు. ఇదివరకు పన్నులు చెల్లించిన వారికి భవిష్యత్‌లో సర్దుబాటు చేస్తాం.

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలపై పన్నుల భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించింది. చాలా రోజులుగా పన్నులు చెల్లించకుండా పెండింగ్‌లో ఉన్న బకాయి లు అపరాధ రుసుములో 90 శాతం రాయితీతో చెల్లిస్తే ఆర్థిక భారం తగ్గుతుంది. గతంలో ఈ అవకాశం ఉండేది కాదు. ప్రజల ఆర్థిక అవసరాలను దృష్టి ఉంచుకుని కల్పించిన సదావకావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- ప్రసన్నరెడ్డి, డిప్యూటీ కమిషనర్, కాశిబుగ్గ

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- నర్సంపేట మునిసిపల్ కార్యాలయం తనిఖీ

నర్సంపేట టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద కోరారు. బుధవారం నర్సంపేట మునిసిపాలిటీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణకు చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2020 ఆగస్టు 26కు ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఈ నెల 31తో ముగుస్తున్నందున దరఖాస్తుదారులు త్వరితగతిన ఫీజు చెల్లించి 25 శాతం రాయితీ పొందవచ్చన్నారు. కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలో 5,732 మంది దరఖాస్తుచేసుకోగా 2,271 క్రమబద్ధీకరణకు మంజూరు చేయగా 293 మంది ఫీజు చెల్లించారని, 186 మందికి క్రమబద్ధీకరణ పత్రాలు అందించామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని దరఖాస్తుదారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోనే ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సంధ్య, టీపీవో వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు కట్టుకోవాలి..

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరూ ఇల్లు కట్టుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యశారద సూచించారు. నల్లబెల్లి మండలంలోని రామతీర్థం, నారక్కపేట గ్రామాల్లో కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. రామతీర్థం గ్రామంలో మంజూరైన 31 ఇందిరమ్మ ఇండ్లు మొత్తం కట్టుకోవాలని లబ్ధిదారులకు తెలియజేశారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు వస్తాయని తెలిపారు. లబ్ధిదారులు త్వరగా ఇండ్లు కట్టుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారుల ఇండ్ల ముగ్గులను, పునాదులను పరిశీలన చేశారు. అంతేకాక, నారక్కపేట మిషన్ భగీరథ పంపుహౌస్‌ను పరిశీలన చేశారు. పంపుహౌస్ వద్ద ఎలాంటి లీకేజీలు లేకుండా చూడాలని ఏఈ, డీఈలకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎస్సై గోవర్ధన్, ఎంపీడీవో నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.


రామతీర్థంలో ఇందిరమ్మ ఇండ్ల ముగ్గును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

- శివారులో స్థలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు
- భారీస్థాయిలో సభ నిర్వహణకు ఏర్పాట్లు

ఎల్కతుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి మండల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ నిర్వహణకు దాదాపుగా స్థలం ఖరారైంది. బుధవారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌లతో కలిసి ఎల్కతుర్తి మండల కేంద్రానికి సమీపంలో స్థల పరిశీలన చేశారు. ఏప్రిల్ 27వ తేదీన వరంగల్ కేంద్రంగా బీఆర్ఎస్ పార్టీ 25 యేళ్ల రజతోత్సవ బహిరంగ సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఇందుకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు నాయకులు స్థల పరిశీలనలో పడ్డారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని వేలాదిగా తరలిరానున్న ప్రజలకు అనువుగా ఉండే ప్రదేశాన్ని ఎంపిక చేయాలని కేసీఆర్ ఆదేశాల మేరకు సభకు అనువైన ప్రదేశాన్ని ఎంపిక కోసం కసరత్తులు ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని భట్టుపల్లి, దేవన్నపేట, ఉనికిచెర్ల గ్రామాల పరిధిలో బీఆర్ఎస్ నాయకులు స్థల పరిశీలన చేశారు. కాగా, ఎల్కతుర్తి మండల కేంద్రం హనుమకొండ, కరీంనగర్, సిద్ధిపేట మూడు జిల్లాల సరిహద్దులో ఉండటంతో సభ నిర్వహణకు అనువైన ప్రదేశంగా నాయకులు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఎల్కతుర్తి - చింతలపల్లి గ్రామాల శివారులోని స్థలాన్ని దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డిలు పరిశీలించారు. సంబంధిత రైతులతో మాట్లాడి ఒప్పందాలు సైతం చేయించుకున్నారు. జన సమీకరణలో భాగంగా మరిన్ని ప్రదేశాలను సైతం చూస్తున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చింతలపల్లి గ్రామ శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు వినయభాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, సతీష్‌కుమార్

లంచగొండి వ్యవస్థను రూపుమాపాలి

లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ


లంచగొండి అధికారులను పట్టించిన వారిని సన్మానిస్తున్న జయప్రకాష్ నారాయణ

హనుమకొండ టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): లంచగొండి వ్యవస్థను క్రమంగా రూపుమాపాలని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్‌నారాయణ ప్రజలకు సూచించారు. బుధవారం హనుమకొండలో జ్వాలా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ ఆధ్వర్యంలో ఇటీవలి కాలంలో లంచగొండు అధికారులను ఏసీబీకి పట్టించిన వారిని జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా సన్మానించి, వారికి నగదు పారితోషిక చెక్కులను అందించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. దేశంలో కొంతమంది జడ్జిలు కోట్లాది రూపాయలతో పట్టుపడుతున్నారని, అలాంటి వారిపై తక్షణమే పార్లమెంటరీ వ్యవస్థ చర్యలు తీసుకోవాలని అన్నారు. నోట్ల కట్టలతో పట్టుబడిన జడ్జిని సస్పెండ్ చేయాలన్నారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం కలుగాలంటే న్యాయమూర్తులను నియమించే విధానం మారాలని అభిప్రాయపడ్డారు. న్యాయ వ్యవస్థలో కొందరు దొంగలున్నారని అన్నారు. రాజకీయాల్లో డబ్బు ఖర్చు చేసి ఓట్లు అడుకుంటున్నారని, తర్వాత ఎమ్మెల్యే మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. తప్పు చేసిన వారికి కఠినంగా శిక్ష లు అమలు చేయాలని అన్నారు. ప్రస్తుతం దేశంలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులకు ప్రమోషన్లు వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. సమాజంలో మార్పు కచ్చితంగా వస్తుందని, ఈ దేశంలోని యువత అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవినీతికి వ్యతిరేకంగా పోరాడేతత్వంలేక, సమయం కేటాయించలేక లంచాలు ఇస్తున్నారని మండిపడ్డారు. దేశంలో లంచం ఇస్తున్నవారు, తీసుకుంటున్నవారు ఈ దేశ సంపదను దోచుకుంటున్నారని తీవ్రంగా ఆరోపించారు. న్యాయ వ్యవస్థ కూడా అవినీతి ఆరోపణలు రావడం సిగ్గుచేటన్నారు.

వరంగల్‌లో పౌరుషం, నిబద్ధతకలిగిన చైతన్య వంతులు ఉన్నారని, నిర్మాణాత్మకంగా లంచగొండు అధికారులకు వ్యతిరేకంగా మార్పు కోసం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్వాలా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని, గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్ కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో గంజాయి కేసులతో పాటు, ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి చర్చించారు. అనంతరం రెవెన్యూ అధికారి వై.వి గణేష్, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారిపై, వినియోగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సినిమా హాళ్లలో కూడా మత్తు పదార్థాల నియంత్రణకు స్లైడ్స్ వేసే విధంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతో పాటు విస్తృతప్రచారం చేపట్టేందుకు క్రీడా, ఇతర రంగాలలోని సెలబ్రిటీలతో గంజాయి, ఇతర మత్తుదార్థాల వలన కలిగే అనర్థాలపై ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అధికారులు, అర్డీఓ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ధరలు.. అన్నదాతల దిగాలు

- ఆందోళన చెందుతున్న మిర్చి రైతులు
- వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆరోపణలు

6



టీజీఆర్‌జేసీలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

నెక్కొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గురుకుల జూనియ ర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 23వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని టీజీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ జి.శ్రీదేవి బుధవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ (ఇంగ్లీష్ మీడియం)లో అడ్మిషన్‌లు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు మే 5వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

మూడోసారి వాయిదాపడిన నెక్కొండ సంత వేలం పాటలు

నెక్కొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీలో నిర్వహించే వారంతపు సంతలో రహదారి వసూళ్లకు బుధవారం జరిగిన వేలం పాటలో నిర్ణీత ప్రభుత్వ దర రాక పోవడంతో అధికారులు వేలం పాటలు మూడోసారి వాయిదా వేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను సంతలో గొర్రెలు, మేకలు, పశువుల, బైబజారు (గంపచీటి) వసూళ్ల సంబంధించి వేలం పాటలు నిర్వహించారు. ఈ పాటల్లో పాల్గొన్న కాంట్రాక్టర్‌లు ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువ పాట రావడంతో పాటలను దుబారా చేశారు. ఈ విషయం జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పంచాయతీ కార్యదర్శి డి.సదానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి దయాకర్, పంచాయతీ సిబ్బంది శ్రీలత, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు .

రైతులకు ఇచ్చిన హామీలను

ప్రభుత్వం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్

నర్సంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో పార్టీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల నిరంకుశ విధానాల వల్ల రైతులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ:20వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంటల కనీస మద్దతు ధర చట్టం అమలుకై ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. రైతాంగ సమస్యలపై ఏప్రిల్ 7, 8 తేదీల్లో ఏఐకేఎఫ్ జాతీయ సమావేశాలు పంజాబ్ రాష్ట్రంలోని జలందర్‌లో జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని అన్నారు. ఈ నెల 28న ఉద్యమంపై నిర్బంధాన్ని నిరసిస్తూ రా ష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనె కుమార స్వామి, గుండెబోయిన చంద్రయ్య, ప్రభాకర్‌రెడ్డి, కుసుంబ బాబురావు, మహ్మద్ ఇస్మాయిల్, నాగెల్లి కొమురయ్య, సింగతిమల్లి కార్జున్, వక్కల కిషన్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కొండా సుష్మితాపటేల్ జన్మదిన వేడుకలు



గీసుగొండలో కేక్‌ను కట్ చేస్తున్న రడం భరత్, రాజ్‌కుమార్

గీసుగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావు దంపతుల కుమార్తె సుష్మితాపటేల్ జన్మదిన వేడుకలను గీసుగొండ మండలంతో పాటు 16వ డివిజన్ ధర్మారంలో బుధవారం పోటాపోటీగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి అన్నదానం నిర్వహించారు. ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేసి దుస్తులను పంపిణీ చేశారు. అయితే గతంలో ఎన్నడులేని విధంగా ఈ సారి సుష్మితా పటేల్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించడంతో రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. కొండా ప్రాబల్యాన్ని మండలంలో చూపిస్తున్నట్లు రాజకీయ విశ్లేకులు భావిస్తున్నారు. కాగా, వేర్వేరు గ్రూపులుగా ఉన్న పలువురు నాయకులు ఒకే వేదిక మీదికి వచ్చి సుష్మితాపటేల్ జన్మదిన వేడుకలను జరపడం గమనార్హం. ఈ కార్యక్రమంలో నాయకులు రడం భరత్, అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, డోలి చిన్ని, రడం శ్రీధర్, శ్రావణ్, బుర్ర కవిత, రఘు, కొండా వెంకన్న, గాజర్ల గోపి, గోనె మల్లారెడ్డి, దర్శనాలు రాజు, దౌడు బాబు, మాజీ ఎంపీటీసీలు వీరారావు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. ధర్మారంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు గోపాల నవీన్‌రాజు, కొమ్ముల కిశోర్, కొమ్ముల బాబు తదితరులు పాల్గొన్నారు.

టీజీఆర్‌జేసీలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

నెక్కొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గురుకుల జూనియ ర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 23వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని టీజీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ జి.శ్రీదేవి బుధవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ (ఇంగ్లీష్ మీడియం)లో అడ్మిషన్‌లు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు మే 5వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలి

నెక్కొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతూ విద్యుత్ ఏడీఈ శ్రీధర్‌కు బుధవారం మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఈదునూరి వెంకన్న వినతి పత్రాన్ని అందించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆరవై సంవత్సరాల క్రితం వేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదంగా ఉన్నాయన్నారు. పల్లెలోని సాదు జంతువులు (పశువులు, మేకలు) విద్యుత్ షాక్ గురై మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంకోసం రోడ్లు వెడల్పు చేయడంతో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలో ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏడీఈ శ్రీధర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, జనార్ధన్ పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన కేడీసీ విద్యార్థులు

గీసుగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల రాజనీతిశాస్త్రం, చరిత్ర విభాగాలకు చెందిన విద్యార్థులు బుధవారం సందర్శించారు. విద్యార్థుల బృందానికి గ్రామాభివృద్ధి, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, అభివృద్ధి కమిటీల పనితీరు, సాధించిన జాతీయ, అంతర్జాతీయ అవార్డులు, అమలవుతున్న మద్య నిషేధం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్‌లు ఇందిరాదేవి, బి.కవిత, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాను తనిఖీ చేసిన అధికారులు

చెన్నారావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారుల బృందం బుధవారం తనిఖీలను చేపట్టారు. ప్రతీ రోజు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని మండల స్పెషల్ అధికారి డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సరళ, మండల తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో శ్రీవాణి, సరళ పాల్గొన్నారు.

బడుగులపై వడ్డీ పిడుగు!

(5వ పేజీ తరువాయి)

పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. పోలీసులను సైతం లెక్కచేయనితనం ఆ మహిళది అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పోలీసుల ఉదాసీనత

ప్రజల మెడపై కత్తి పెట్టి వడ్డీలకు వడ్డీలు వసూలు చేస్తున్న వడ్డీ వ్యాపారులపై పోలీసు ఉదాసీన వైఖరి అవలంబిస్తుండడంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతున్నది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వడ్డీ వ్యాపారులకే వత్తాసులు పలకడంతో బాధితులు తమ గోడును ఎవ్వరికీ చెప్పుకోలేక మథనపడిపోతున్నారు. ఇప్పటికైనా అక్రమ వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇందిరమ్మ ఇండ్లపై నిరంతర పర్యవేక్షణ

• జడ్పీసీఈవో రామిరెడ్డి

నెక్కొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లులేని నిరుపేదల కలను నెరవేర్చేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని జడ్పీ సీఈవో జి. రామిరెడ్డి సూచించారు. మండలంలోని బొల్లికొండ గ్రామం మోడల్ విలేజ్‌గా ఎంపిక కావడంతో ఇండ్ల నిర్మాణాలను ఆయన అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామానికి ఇప్పటి వరకూ 120ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్మాణం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వి.గణపతి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో జి. దయాకర్, పంచాయతీ కార్యదర్శి ఎం.పెంటయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.



బొల్లికొండలో ఇందిరమ్మ ఇండ్లను పర్యవేక్షిస్తున్న రామిరెడ్డి

• లబ్ధిదారులు త్వరగా ఇండ్లు నిర్మించుకోవాలి

పర్వతగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని జమాల్‌పూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇద్దరు లబ్ధిదా రుల ఇంటి స్థలాన్ని పరిశీలించారు. 400 నుంచి 500 స్క్వేర్ ఫీట్లలో ఇంటిని నిర్మించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీలో అధికారులు, ఇందిరమ్మ గ్రామ కమిటీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ గ్రామంలో 48 మందిని ఎంపిక చేశామన్నారు. మొదటి విడుతలో 25 మందిని గుర్తించామన్నారు. ఎంపికైన లబ్ధిదారులు ఈ నెల 30లోగా ఇండ్లను నిర్మించుకోవాలన్నారు. ఇసుక సమస్య ఉందని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ గణపతి, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో పాక శ్రీనివాస్ ఇన్‌చార్జ్ పంచాయతీ సెక్రటరీ దివ్య తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోపు ఉపకార వేతనాల బకాయిలు చెల్లించాలి

నర్సంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మార్చి నెలాఖరులోపు ఉపకార వేతన బకాయిలు చెల్లించాలని లేనిపక్షంలో రాబోయే సెమిస్టర్ 2, 4, 6 పరీక్షలను బహిష్కరిస్తామని ప్రవేటు కళాశాలల యజమానులు జీజుల సాగర్, రవి, సర్వేశం అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఉమారాణికి డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామీణ ప్రాంత కళాశాలలు కేవలం ప్రభుత్వం ఇచ్చే ఉపకారవేతనాలపపై ఆధారపడి నడుస్తున్నాయన్నారు. ప్రైవేటు కళాశాలలు ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఉపకార వేతనాలను ఇవ్వకపోవడం వల్ల నిరుద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితులతో పాటు అద్దె భవనాల కిరాయిలు చెల్లించలేని పరిస్థితులను నిర్వాహకులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. 90శాతం ఉపకారవేతనాల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందన్నారు. ప్రైవేటు కళాశాలల యజమానుల ఇబ్బందులను పరిశీలించి ప్రభుత్వం వెంటనే ఉపకారవేతనాలను విడుదల చేయాలని, లేని పక్షంలో ప్రభుత్వం నిర్వహించే పరీక్షలను నిర్వ హించలేమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోగుల ప్రభాకర్‌రెడ్డి, మల్లేశం, మోర్తాల రాంరాజ్, గుంటుక రాజ్‌కుమార్, బొనగాని రవీందర్, తిరుపతి, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట ఆర్డీవో ఉమారాణికి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు కళాశాలల యజమానులు

పచ్చని చెట్లకు గొడ్డలి కాటు

• మోడుబారెందుకు చెట్ల బెరడు తొలగింపు

ఖానాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో హరిత హారం కార్యక్రమం ఆరంభంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా ఎదిగి బాటసారులకు నీడనిస్తున్నాయి. వాటికింద సేదతీరుతున్నారు. కానీ, కొందరు వక్రబుద్ధితో ఎదిగిన వృక్షాలను నేలకూల్చడానికి ప్రయత్నిస్తున్నారు. మండల కేంద్రం శివారులోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పెద్దమ్మగడ్డ తండాకు వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా అటవీ శాఖ ఆధ్వర్యంలో తొలి విడత హరితహారం కార్యక్రమంలో నాటిన చెట్లు ఏపుగా పెరిగి వృక్షాలుగా తయారయ్యాయి. రెండు రోజులు క్రితం వాటిలో కొన్ని చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు చెట్ల మొదలు భాగంలో గొడ్డలితో గాటుపెట్టి చెట్లు మోడుబారెందుకు బెరడును తొలిగించారు. దీంతో అటుగా వెళ్లే బాటసారులు, వాహనదారులు గొడ్డలి కాటుకు గురైన చెట్లను చూచి చలించిపోతున్నారు.



చెట్ల మొదళ్ల వద్ద గొడ్డలితో బెరడు తొలిగించిన దృశ్యం

తండాలను జీపీలుగా మార్చాలి

వర్ధన్నపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మున్సిపాలిటి నుంచి గిరిజన తండాలను తొలగించి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం వర్ధన్నపేట పట్టణ పరిధిలోని డిసి తండా వద్ద వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై గిరిజనులు రాస్తారోకో, దర్నా నిర్వహించారు. దీంతో ఇరువైపుల వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పాడింది. ఈ రాస్తారోకోలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వర్ధన్నపేట మున్సిపాలిటి నుంచి గిరిజన తండాలను వేరు చేసి గ్రామపంచాయతీలుగా మారుస్తామని హామీ ఇచ్చి సంవత్సరం దాటిన పురోగతి లేదని, ప్రభుత్వాని వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం గిరిజన తండా వాసుల అభ్యర్థన మేరకు గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ స్థంబించడంతో వర్ధన్నపేట ఏసిపి నర్సయ్య, సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు చందర్, రాజు, సిబ్బంది రాస్తారోకో ప్రాంతానికి చేరుకోని గిరిజనలకు నచ్చజేప్పారు. దీంతో రాస్తారకో విరమించారు. ఈ కార్యక్రమంలో గిరిజన తండాల నాయకులు అంగోతు తారబాయి, మాలోతు దేవేందర్, అంగోతు లచ్చిరాం, శ్రీదర్, మహిబుబ్, వీరన్న, యాకోబ్, మాక్య, సంతోష్, అంజి, చిలుకమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న గిరిజనులకు నచ్చచేప్తున్న పోలీసులు

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

రాయపర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల పవిత్రమైన రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకని టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్‌లు అన్నారు. బుధవారం మండలంలోని కొండూరులో జామా మసీదులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఆదేశాల మేరకు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సురేందర్, మహేందర్‌రెడ్డి, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ముగ్దుంపురంలోని మసీద్‌లో ముస్లింలు ఇఫ్తార్ విందును బుధవారం ఏర్పాటు చేశారు. జూనియర్ అసిస్టెంట్ అంజద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రషీద్, ఎండీ రఫీ, మజీజ్ మమ్మదీయ సంఘం అధ్యక్షుడు ఎండీ అయ్యూం, అంకూస్, బషీర్, వలీ, కరీం, యాకుబ్ పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధులలో వెలుగులు నింపాలి

గీసుగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నేత్రదానం చేసి అంధులలో వెలుగులు నింపాలని జాతీయ అవార్డు గ్రహీత, అవయదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. కొమ్మాల జాతరలో నేత్రదానంపై అవగాహనను బుధవారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్యతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేశ్వర్‌రావు, మెడికల్ ఆఫీసర్‌లు శ్రావణ్, దామోదర్, అర్జున్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



శివ (ఫైల్)

గీసుగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలుకుర్తికి చెందిన నిమ్మకాయల శివ(23) అనే యువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ వరంగల్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. అతడు కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కాగా, బుధవారం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి లింగమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

ప్రజలు ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలి

వర్ధన్నపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించి తమ ఆరోగ్యలను పరిరక్షించుకోవాలని జిల్లా వైద్యధాకారి సాంబశివరావు అన్నారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి, పీహెచ్‌సీ సబ్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి సేవలు పెంచాలని, అందులో నార్మల్ డెలివరీ అయ్యేవిధంగా గర్భిణులకు ముందస్తు సూచనలు చేస్తూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉందని వీలైనంతవరకు ఎండ తీవ్రత లేని సమయంలోనే తమ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. వైద్యులు వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధులకు డుమ్మాకొడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సంగెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిల చిత్రపటానికి బుధవారం మహిళా బృందాల సభ్యులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వయం సహాయక బృందాల మహిళలకు ఉగాది కానుకగా వడ్డీ లేని రుణాలను వీఎల్ఆర్ మంజూరు చేసిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, శాంతి మండల సమాఖ్య కార్యదర్శి రాజమణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, సంధ్యారాణి, కళావతి, నరహరి, వీరమ్మ, ఏపీఎం కిషన్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, జనగాం రమేష్, కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మందపల్లి సబ్ సెంటర్ తనిఖీ

దుగ్గొండి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందపల్లి సబ్ సెంటర్‌ను బుధవారం డిప్యూటీ డీఎం హెచ్‌వో ప్రకాష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ సెంటర్ పరిధిలో చిన్న పిల్లలకు టీకాలకు వేయించాలన్నారు. వంద శాతం టీకాల కార్యక్రమంను విజయవంతం చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహనను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వనమాల, సూపర్ వైజర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తస్మాత్ జాగ్రత్త

• డాక్టర్ రాంమూర్తి, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

ఫటా ఫట్



ఆంధ్రజ్యోతి : వేసవి కాలంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

సూపరింటెండెంట్: వేసవికాలంలో చల్లని ప్రదేశంలో ఉండే విధంగా చూసుకోవాలి. రోజు ఎనిమిది గ్లాసుల నీరు తాగాలి. ఉప్పు కలిపిన నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్ల తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : ఆస్పత్రి ఓపీ సమయంలో ఎంత మంది అనారోగ్యంతో ఆస్పత్రికి వస్తున్నారు ?

సూపరింటెండెంట్ : ప్రతి రోజూ ఓపీ సమయంలో 300 నుంచి 400 మంది వరకు అనారోగ్యంతో ఆస్పత్రికి వస్తున్న ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఆస్పత్రికి వచ్చే వారిలో ఏ సమస్యతో అధిక సంఖ్యలో వస్తుంటారు ?

సూపరింటెండెంట్ : వైరల్ ఫీవర్, డిహైడ్రేషన్, వాంతులు, విరోచనలతో అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు.

ఆంధ్రజ్యోతి : పాము, తేలు, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయా ?

సూపరింటెండెంట్: పాము, తేలు, కుక్కకాటు మందులతోపాటు రోగులకు కావల్సిన మందులు 24గంటలు అందుబాటులో ఉంటాయి.

ఆంధ్రజ్యోతి : ప్రసూతి కోసం ఆస్పత్రికి వచ్చే మహిళలకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు?

సూపరింటెండెంట్ : ప్రసూతి కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య సేవలు అందించడంతో పాటుగా ప్రథమంగా నార్మల్ డెలివరీ చేయడానికి ప్రాధాన్యమిస్తునాం.

వర్ధన్నపేట (ఆంధ్రజ్యోతి)

వైద్య సేవలు సంతృప్తికరం



వైద్యులతో కాయ కల్ప బృందం

వర్ధన్నపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కాయ కల్ప కార్యక్రమంలో భాగంగా బుధవారం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పతిని మంథిని జిల్లా పెద్దపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, అతని బృందంతో కలిసి ఆస్పత్రి ఆవరణ, వార్డులు ఆపరేషన్ థియేటర్, క్యాజ్‌వాలిటీ, ఓపి, ల్యాబ్‌లను సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన పేషంట్‌లతో పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి డైట్ వివరాలను, వైద్యులు సకాలంలో వస్తున్నరా, చికిత్స అందిస్తున్నారా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణతో పాటు భవనాలు పరిశ్రుభంగా ఉండడంతో సిబ్బందిని అభినందించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని, కాయ కల్ప కార్యక్రమంలో ఎంపిక చేస్తూ ప్రభుత్వానికి నివేదిక అందించనున్నామని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాంమూర్తి, విజయ్‌కుమార్, భరత్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఫోరేన్స్ సిస్టర్ తిరుమల, మిరియం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం

పర్వతగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్లకొండలో నూతనంగా చేపట్టిన సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు రూ.1,01,116 విరాళంగా ఇచ్చారు. ఈ నగదు మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు.

రేకంపల్లి మాజీ సర్పంచ్ మృతి



లక్ష్మి (ఫైల్)

దుగ్గొండి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేకంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మంద లక్ష్మి(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. గ్రామంలో 2013 నుంచి 2018 వరకు సర్పంచ్‌గా పని చేశారు. మాజీ సర్పంచ్ మృతి పట్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, నియోజకవర్గ కన్వీనర్ శానబోయిన రాజుకుమార్, కాట్ల భద్రయ్య, పలువురు పరామర్శించారు.

ప్రభుత్వం ఉపాధి కల్పించాలి

వర్ధన్నపేట రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పేద బడుగు బలహీన వర్గాలకు ఉపాధి మార్గంగా ఉన్న ఇసుక వ్యాపారం ప్రభుత్వం నిలిపివేయడంతో ఉపాధి లేక ప్రజలు అల్లాడిపోతున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని కట్ర్యాల గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఇసుక రవాణా ప్రభుత్వం నిలిపి వేయడం వలన చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

కొనసాగుతున్న గుడిసెవాసుల దీక్షలు

నర్సంపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎంఎస్‌పి, డీబీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌నగర్ గుడిసెవాసులు చేపట్టిన రిలేనిరహాదీక్షలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. దీక్షలో స్థానిక తహసీల్దార్ రాజేష్ చిత్రపటంతో బైఠాయించారు. గుడిసెలు వేసుకొని నాలుగేళ్లవుతున్నదని కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. వరం గల్‌రోడ్డులోని సర్వే నెంబర్ 813లో అంబేద్కర్‌నగర్ గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలిచ్చి ఇంటి నెంబర్లు, కరెంటు, నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షలో పి.ఉప్పన్న, మాలతి, రత్నం, రవి, విమల, విజయ, సమ్మక్క, స్వరూప, రాజమణి, చక్రపాణిలు బైఠాయించగా, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి ప్రణయ్‌దీప్, యాకూబ్, జలగం రమేష్‌లు సంఘీభావం తెలిపారు.